గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మే 2015
# కథలు




రామారావింటికి ఆరోజు ఉదయం అనుకోకుండా బంధువులొచ్చారు. దగ్గరా, దూరమా అని కాదు కాని చాలా ముఖ్యమైన బంధువులు. కూతురి యిద్దరు అడపడుచులూ వారి భర్తలతో, పిల్లలతోసహా ముందు సమాచారం లేకుండా రావడంతో దంపతులిద్దరూ కంగారూ పడిపోయారు. రామారావు పై అధికారికి ఫోన్లో చెప్పి సెలవుతీసుకొన్నాడు. దగ్గరలోనే ఉన్న రైతుబజారుకి పోయి దండిగా కూరలూ, కిరాణా దుకాణానికి పోయి దండిగా సరుకులూ తీసుకొన్నాడు. వారు రాగానే కాఫీలందించి, స్నానాలూ అవీ ముగిసిన తర్వాత, పదింటికి వేడివేడిగా, పుష్కలంగా జీడిపప్పు దట్టించిన కమ్మటి ఉప్మా అందించింది. కూరలంటే అనుకోవచ్చుకాని, పదోతారీఖుకే యింట్లో సరుకులు లేకపోవడం వారికి వింత అనిపించి కూతురి అదపడుచులు చాటుగా బుగ్గలు నొక్కుకొన్నారు.

ఆ తర్వాత రామారావు వారిని తన కారులో ఊరి పొలిమేరల్లో ఉన్న భావనారాయణస్వామి ఆలయానికి తీసుకు వెళ్ళాడు. అక్కడికి మరో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దొంగల గుహల్ని చూపించి, గంధకం ఊటజలాల్లో స్నానాలు చేయించి తిరిగి వచ్చేసరికి ఒంటిగంట దాటింది. రామారావు భార్య రెండు కూరలు, రెండు పచ్చళ్ళు,పప్పు, సాంబారు, గడ్డపెరుగులతో భోజనం తయారుచేసి బల్ల మీద అందంగా అమర్చింది. ఆడపడుచుల భర్తలు ఎంతగా బలవంత పెట్టినా రామారావు దంపతులిద్దరూ వారికి వడ్డించడంలోనే మునిగిపోయారు తప్ప, కలిసి భోజనం చెయ్య లేదు.భుక్తాయాసంతో వారు కునుకులు తీసే సమయంలో రామారావు దంపతులు వంట గదిలోనే తమ భోజనం ముగించారు.యిది చిన్నాడపడుచు గమనించి, అక్క చెవిలో ఊదింది.

సాయంత్రం రామారావు వారికి మరికొన్ని ప్రదేశాలని చూపించి చీకటి పడినతర్వాత యింటికి తీసుకు వచ్చాడు. ఏదైనా హోటల్లో అందరూ కలిసి భోజనం చేద్దామన్నారు అదపడుచుల భర్తలు.

‘వంట చేసేశాను. భోజనం సిద్ధంగా ఉంది. హోటలెందుకు?’ అంది రామారావు భార్య. రాత్రి వంటకూడ భారీగానే ఉంది. రామారావు దంపతులిద్దరూ మధ్యాహ్నంలాగే వారితో కలిసి భోజనం చెయ్యలేదు. హాయిగా మాటలు చెబ్తూ, వడ్డన చేస్తూ కాలం గడిపేశారు. ‘మాతో కలిసి భోజనం చెయ్యకుండా, మీరు అతిగా అతిథి మర్యాదలు చేసి మమ్మల్ని యిబ్బంది పెడ్తున్నారు!’ అంది కూతురి పెద్దాడపడుచు లీలగా కాస్త వ్యంగ్యాన్ని జోడిస్తూ. రామారావు దంపతులు చిరునవ్వు నవ్వి మౌనంగా ఉండిపోయారే తప్ప ఏ సమాధానమూ యివ్వలేదు. వారందరికీ డాబామీద ఆరుబయట మడత మంచాలు వేసి పడకలు ఏర్పాటు చేశాడు.‘వారి కూతుర్ని మనమెక్కడ తక్కువగా చూస్తామనేనేమో, అతి చేస్తున్నట్టుగా ఉంది!’అని అక్క చెల్లెళ్ళిద్దరూ గుసగుసలాడుకొన్నారు.

పెద్దాడపడుచు భర్తకి రాత్రి భోజనం చేసిన తర్వాత, ఓ సిగరెట్ కాలుస్తూ కాస్త దూరం నడవడం అలవాటు. రామరావూ, అతనూ కలిసి కాస్త దూరంలో ఉన్న కిళ్లీ దుకాణం వైపు దారితీశారు.’బాబాయ్ గారూ, రేపు మనందరము బయట భోజనం చేద్దాం. పిన్నమ్మగారికి శ్రమ యిచ్చేస్తున్నాం!’అన్నాడతను.

‘మీ మొహమాటాన్నీ, యిబ్బందిని గమనించక కాదు. మాకూ అందరితో కలిసి సరదాగా భోజనం చేయాలనే ఉంటుంది. కాని, మాకిద్దరికీ అధికస్థాయిలో మధుమేహవ్యాధి ఉంది. మేము మెతుకులు కొరుకుతూ తిన్నా, లేదా దంపుడుబియ్యపు పత్యం భోజనం నలుగురిమధ్యా పెట్టుకొని తిన్నా, పక్కన తినేవాళ్ళకి యిబ్బంది కదా? పత్యం చేసేవాడికి పదిమందిలో భోజనం పెడ్తే అంతకు మించిన శిక్ష ఉండదని లోకోక్తి ఉండనే ఉంది! అందుకనే విందుభోజనాలకి బఫే ఉంటే తప్ప మేము వెళ్ళేది లేదు. మా ఆహార నియమాల్ని సడలించుకోలేక, అప్పుడప్పుడూ యిలాంటి పరిస్థితుల్లో, అతిథి సత్కారానికి భంగం కాకుండా మసులుకుంటూనే, చిరునవ్వులను జోడించి వడ్డన చేయడం అలవాటైపోయింది. అతిథులు భోజనం చేసిన తర్వాతే ఆతిథ్యమిచ్చేవారు భోజనం చెయ్యాలన్నది ప్రాచిన సంప్రదాయమేకదా?’ అన్నాడు రామారావు.‘ మీ నియమపాలన మెచ్చుకోదగ్గది బాబాయ్ గారూ! పదండి వెనక్కి పోదాం. ఈ క్షణం నుండీ నా ఈ సిగరెట్ కాల్చే అలవాటుకి స్వస్తి!’ అన్నాడతను.




రైల్వేస్టేషన్లో అనౌన్స్ మెంట్ బయటికి వినిపిస్తోంది.' దయచేసి వినండి ! బెంగుళూరు కాచిగూడా ఎక్స్ ప్రెస్ ఐదవనెంబర్ ప్లాట్ ఫాం మీద నిలచి ఉన్నది .' అప్పారావు హడావిడిగా రైల్వేస్టేషన్ చేరుకుని, అనౌన్స్ మెంట్ విని, ' రైల్ నిలచి ఉండక పండుకోని ఉంటుందా! ఏదో మునిగి పోయినట్లూ ఈ అనౌన్స్ మెంట్ ' అని గొణుక్కుంటూ, బ్యాటరీ కార్ కోసం చూశాడు. ఐదో నెంబరు ప్లాట్ ఫాం కెళ్ళాలంటే అప్పారావుకు వీల్ ఛైర్ అవసరం తప్పనిసరి. కనుచూపు మేరలో కాన రాలేదు. అక్కడ ఉన్న రైల్వే పోర్టర్ " సార్ ఎక్కడికెళ్ళాలి? " అని అడిగాడు, అప్పారావును ఎగా దిగా చూస్తూ. "కాచిగూడా ఎక్స్ ప్రెస్ కెళ్ళాలోయ్! బేటరీ కార్ వస్తుందా?" " అదెక్కడుందో తెలీదుసార్! మీ లగేజ్ నేను తెచ్చి మీ బోగీలో పెడతాను రండి సార్! ఈ మెట్లమీదుగా వెళదాం '"అన్నాడు. " నేను మెట్లెక్కలేనయ్యా! నాకు బీ.పీ, షుగరూనూ, కాస్తంత బ్యాటరీ ఛైర్ కారు పిలుద్దూ!" అన్నాడు బ్రతిలాలుతూ. " సార్! మీ లగేజికి మూడు వందలివ్వండి, నేనెళ్ళి వీల్ ఛైర్ తెస్తాను, మిమ్మల్ని ఐదో నెంబర్ కు నెట్టుకుంటూ తీసుకెళ్తాను. సరా?" అన్నాడు. ఇహ తప్పదని " సరే వెళ్ళి తీసుకురా! రెండొంద లిస్తాన్లేవోయ్! ఒక్క బేగేగా " అన్నాడు అప్పారావ్.

" సార్ మిమ్మల్ని నెట్టు కెళ్ళేందుకే మూడొందలు సార్ బేగ్ ఫ్రీ! ఆపైన మిమ్మల్నీ మీ సామాన్నూ తెచ్చి బోగీలో పెట్టాలా? మీ లాంటి వారిస్తేనే కదా మాలాంటోళ్ళు బతికేది, పొట్ట చేత బట్టుకుని ఆంధ్రానుంచి వచ్చాను సార్!" అంటూ తనబాధ వెళ్ళగక్కాక ఇహ తప్పదని " సరే వెళ్ళిపట్రాపో రైల్ కదుల్తుందేమో!" అన్నాడు అప్పారావ్ కంగారుగా." " నేను హామీ సార్ రైల్ కదిల్తే మీకే ఐదొందలిస్తాను." పోర్టర్ లాజికల్గా అన్నాడు.."నీ ఐదొంద లెందుగ్గానీ నా త్రీ టైర్ ఏసి టికెట్ పదిహేను వందలూ పోతుందోయ్! రైల్ పోతే , వెళ్ళుత్వరగా.."అని అప్పారావ్ తొందర చేయగానే , పక్కకెళ్ళి పోర్టర్ ఎవరికో ఫోన్ చేశాడు.

పదినిముషాలైనా వీల్ చైర్ రాలేదు.అప్పారావ్ కంగారు పెరిగింది. "ఏదయ్యా వీల్ చైరూ? వస్తుంది వస్తుంది అంటూనే ఉన్నావ్!" వాచీ చూసుకుంటూ అన్నాడు అప్పరావ్ ." కంగారొద్దు సార్ ! వస్తుంది. " అంటూ మళ్ళీ ఫోన్ చేసి " బేగిరావోయ్ ! సార్ ! కంగార్పడు తుండ్రు. , పోనీ బేటరీ కారు పట్రా , రైల్ కదులుద్ది" అంటూ తొందర చేయగా , మరో పది నిముషాల్లో బేటరీ కార్ వచ్చింది.

దాన్లో వెనక అప్పారావ్ ఎక్కలేక అవస్త పడుతుంటే ఇద్దరూ కల్సి చేతులు పట్టి సీట్ పైకి లాగారు. " సార్ టైమవుద్ది నేనూ ఈ కార్లో నే వచ్చి లగేజ్ బోగీలో పెడతాను." అంటూ వాడూ డ్రైవర్ పక్కనెక్కి కూర్చున్నాడు. పది నిము షాల్లో బ్యాటరీకారు వెళ్ళి ఐదో నెంబర్ ప్లాట్ ఫాం మీద , భ్2 బోగీవద్ద ఆగడం , ఇద్దరూ పట్టుకుని అప్పారావ్ ను దింపి రైల్ బోగీ లోకి ఎక్కి చేతులు పట్టి లోనికి లాగడం,ఆ పైన బెర్త్ వరకూ వెళ్ళి బేగ్ పెట్టడం నిముషాల్లో జరిగిపోయింది. " మీ బెర్త్ అప్పర్ సార్ ! రైల్ కదులుద్దేమో డబ్బివ్వండి సార్!" అనితొందర చేసి మూడొందలూ తీసుకుని పోర్టర్ దిగిపోయాడు. అప్పారావ్ అయోమయంగా ‘ మూడొందలిచ్చింది తనబ్యాగ్ మోసినందుకో తనతోపాటు బోగీవరకూ పోర్టర్ బ్యాటరీ కారులో వచ్చినందుకో అర్ధం కాక , వాస్తవానికి వచ్చి అప్పర్ బెర్త్ వేపు ఎగాదిగా చూసుకుంటూ క్రింద సీట్లో కూర్చున్నాడు. పక్కనే ఉన్న మహిళ జరిగి చోటిచ్చింది. రైల్ కదిలింది.

ఇక్కడ మా అప్పారావుగురించి ఒక్కమాట చెప్పుకోవాలి.మావాడు కాస్తంత పొట్టిగా మరీ కాదనుకోండీ ఐనా ఐదడుగుల భారీ విగ్రహం, కొంచెం పొట్ట , ఐతే తెల్లగా మల్లెపూవ్వులా ఉంటాడు, దానికి ఈడూ జోడూగా ఉండే తెల్లబట్టలే ఎప్పుడూ వేసుకుంటా డు హుందాగా. నడుస్తుంటే’ చిన్నపాటి తెల్లేనుగు నడిచి నట్లుంటుందని’ అంతా అనుకుంటారు గుస గుసగా. ఆగుస గుసలు అప్పారావుకూ తెల్సు. నవ్వి ఊరుకుంటాడు. బస్సెక్కాలంటేనే మావాడికి కష్టం , బస్సుకుండే మూడు, నాల్గు మెట్లూ ఎత్తుగానే ఉండటాన మావాడికి ఎవరై నా’ చే’సాయం చేయక తప్పదు. అందుకే మా అప్పారావు తనవెంట పనీ పాటాలేని పాపారావును వేసుకు తిరుగు తుంటాడు. వాడికి డ్ఫ్ అదేనండీ! ‘ దండగ పిండం ‘ పెడుతూవాడి ‘ చే ‘సాయం బదులడుగు తుంటాడు.

ఓమారేమైందంటే అప్పారావు బాబాయి’ కూతురి పెళ్ళి కుదిరిందనీ తాంబూలాలు పుచ్చుకోను రమ్మనీ ‘ చరవాణి తో కబురు చేశాడు. హైదరాబాదెళ్ళాలంటే బెంగుళూరు నుంచి యస్వంత పూర్ రైల్వేస్టేషన్ కెళ్ళి రైలెక్కి హైదరాబాదు చేరాలి. పాపారావును పంపి టికెట్ బుక్ చేయించాడు. అప్పర్ బెర్త్ వచ్చింది. " నీవూ రారాదు టోయ్ సరదాగా?" అని అప్పారావన్న దానికి " నాకు రైల్ పడదన్నా ! ఈ ఊర్లో వరకూ నీ వెంటే ఉంటాగా?" అన్నాడు. టీ. సీని బ్రతిమాలాడు అప్పారావు . " ఒక్క లోయర్ బెర్త్ ఇప్పిం చండి సార్ ! పైకెక్కలేను," అని. అతగాడు " ఖాళీలే లేవండీ! మీరెవర్నైనా అడగండి, వాళ్ళొప్పు కుంటే అడ్జెస్ట్ చేస్తాను." అన్నాడు. అప్పారావ్ కి వళ్ళుమండింది " వాళ్ళొప్పు కుంటే మీరేందీ అడ్జెస్ట్ చేసేది? ఐనా నేను లోయర్ బెర్త్ కోసం అప్లై చేస్తే నాకీ అప్పర్ బెర్త్ ఎలా ఇస్తారండీ! మీ రైల్వే వారి కసలు మనస్సే ఉండదా? డబ్బులు గుంజడ మే నా? " అని కడుపుమంట వెళ్లబోసు కున్నాడు . " నేనేం చేయనండీ టికెట్ చెక్ చేయడమే నాడ్యూటీ. " అంటూ వెళ్లాడతను. ఇహ వేరేదారిలేక పాపం అప్పారావ్ పై కెక్క లేకా ఎవ్వరూ పైకెక్కను ఒప్పుకోకా, అప్పర్ బెర్త్ వైపు చూస్తూ లోయర్ బెర్త్ లమ ధ్య న క్రింద దుప్పటి పరుచుకు పడుకున్నాడు. రాత్రులు ఒంటి కెళ్ళేవారంతా అప్పారావును తొక్కుకుంటూ వెళ్ళేవారే! అప్పారావూ బాత్ రూం

కెళ్లాల్సి , పైకి లేవ లేక పక్కనే ఉన్న లోయర్ బెర్త్ మీద చేతులు పెట్టి లేవబోగా అక్కడ పడుకున్న మహిళకు చేతులు తగిలి ఆమె , పెద్దగా కేకలేసి , ఆమె భర్తను పిలిచింది. అతగాడు వచ్చి లైట్లేసి " ఏమయ్యా ! తెల్లగుడ్డ లేసు కుని చూట్టానికి మర్యాదున్నవాడిలా ఉన్నావ్?

వయస్సులోనూ పెద్దవాడివి? సిగ్గూ బిడియం లేదా! ఆడవాళ్ల మీద చెయ్యే స్తావా? నాభార్య నగలుంకొట్టేయాలని చూస్తావా? తెల్ల గుడ్డ లేసుకున్న దొంగ వెధవ్వాయేం? అసలి లాంటి వాళ్ళ నిక్కడ ఎలా పడుకో నిచ్చాడయ్యా టీ.సి. ఎక్కడ ఆటీసి ?" అంటూ కేకలేయ సాగాడు. అంతా వచ్చి చుట్టు ముట్టారు. అప్పారావు పైప్రాణం పైనే పోయినట్లైంది, పైకి లేవలేక అలాగే బాసిం పెట్లేసు కుని క్రిందనే కూర్చుని తల మాత్రం పైకెత్తి నిస్సహాయంగా చూడసాగాడు. "అయ్యా! నాది అప్పర్ బెర్త్ ! ఎక్కలేనంటే ఎవ్వరూ ఎడ్జస్ట్ అవలేదు. మీరంతా పడుకున్నారాయె ! నేనెక్కడ కూర్చోను ? అందుకే ఇక్కడ పడుకున్నా.బాత్ రూంకెళ్ళా ల్సి లేవలేక ఈ బెర్త్ ను ఊతకోసం పట్టుకున్నా నయ్యా! అంతే కావలిస్తే ఇదిగోండి నా టికెట్ చూడండి! అంటూ జేబులోంచి టికెట్ తీసి చూపాడు. అంతా నమ్మారు.'పాపం పాపం ' అనుకున్నారు, ఏమనుకున్నా డో ఏమోకాని ఆమహిళ భర్త " సారీ సార్! నేను పైకెక్కుతాను. మీరు నా లోయర్ బెర్త్ లో పడుకోండి, " అంటూ చేసాయం చేసి అప్పారావున్న క్రిందనుంచి లేపాడు.ఆమహిళ , " క్షమించండి అన్నయ్యగారూ ! భయపడ్డాను" అంది తలవంచుకుని. " సహజంలేమ్మా! రోజులట్టా వున్నై " అన్నాడు అప్పారావ్. " మీరి బెర్త్ మార్పు ఆయనడిగినప్పుడు ఇందాకే చేస్తే ఈగోల లేకపోనుకదండీ!

భయంతో నాగుండె రెండొందలమార్లు కొట్టుకుంటున్నది " అంటూ భర్తకు సన్నగా పోపు పెట్టిందావిడ. పాపం ఇది అప్పారావ్ మొదటి అనుభవం. ఆతర్వాత ఒకటా, రెండా ఎన్నో ఇలాంటి అనుభవాలు అప్పారావ్ కు. అదేం ఖర్మమో కాని అప్పారావ్ టికెట్ కోసం వెళ్లాడంటే అన్నీ అప్పర్ బెర్త్ లే ఖాళీగా ఉంటాయి.లోయర్ బెర్త్ లన్నీ ఎప్పుడో ఐపోతాయి. మొదటి అనుభవం తర్వాత అప్పారావ్ క్రిందపడుకోను భయపడి, అలాగే సైడ్ బెర్త్ వాళ్ళ పర్మిషన్ తో వాళ్ళ కాళ్ళ దగ్గర కూర్చునేవాడు. వెయ్యా, 12 వందలూ పెట్టి టికెట్ కొని కురుక్షేత్ర యుద్ధంలో సహాయంకోసం వెళ్ళిన అర్జునుడు శ్రీకృష్ణుని కాళ్ల వద్ద కూర్చున్నట్లు కూర్చునే వాడు. అతడి బాధ చూస్తూండేవారేకానీ ఒక్కరంటే ఒక్కరన్నా అతడికి లోయర్ బెర్త్ బదులిచ్చి నపాపానపోలేదు.అతడి బాధ చూస్తూండేవారేకానీ ఒక్కరంటే ఒక్కరన్నా అతడికి లోయర్ బెర్త్ బదులిచ్చినపాపానపోలేదు. వయసు చూసైనా రైల్వే టికెట్ డిపార్ట్ మెంట్ 60 దాటిన వయో వృద్ధులకు లోయర్ బెర్త్ ఎందుకివ్వదో అప్పారావుకు తల బద్ద లు కొట్టుకున్నా అర్ధంకాదు.

అందరికీ సీనియర్ సిటిజన్స్ అంటే అమిత గౌరవం ఉన్నట్లు ఉత్తుత్తి మాటలు మాట్లాడుతారు. అప్పర్ కెటూ [ పైకి ] వెళ్ళేవారేగనుక అప్పర్ బెర్త్ ఇచ్చేసి చేతులు దులుపుకుంటారేమో అనుకుంటాడు అప్పారావ్ తనకు అప్పర్ బెర్త్ ఇచ్చినప్పుడల్లా. ఓమారు పాపారావ్ ఒక సలహా ఇచ్చాడు " మిత్రమా! పోనీ ఎక్కువ డబ్బుకట్టి అదేంటే తత్కాల్ కొందామా! అడిగిన బెర్త్ ఇస్తా రుట!" అన్నాడు. ఆసంబడమూ తీరింది.హైదరాబాదులో ఉండే అన్నయ్య కు వంట్లో బావులేదని ఫోనొస్తే అప్పటికపుడు తత్కాల్ టికెట్ 18 వందలు పోసికొని వెళ్తే అదీని అప్పర్ బెర్తే!" ఇదేంటోయ్ ! పాపారావ్! లోయర్ బెర్త్ అన్నావూ?" అంటే "తప్పక మారుతుందండీ! ఇది కన్ ఫర్ మేషన్ మాత్ర మే అందయ్యా ఆ టికెట్ కొట్టినావిడ!" అన్నాడు పాపారావ్.అప్పారావ్ కు ఒక డౌట్ కూడా ఉంది." రైల్వేవారు టికెట్స్ కొట్టి సొమ్ముచేసుకోను ఇలా' తత్కాల్ '

అబద్ధమాడుతున్నారాని. ఐనా ఈ తత్కాల్ టికెట్టంత మోసం మరోటిలేనేలేదుస్మీ! తత్కాల్ టికెట్ తో జర్నీ చేయాలి, లేకపోతే సొమ్ము మురిగ్గుంటకే అదే రైల్వే డిపార్ట్ మెంట్ కే. బోగీలో సీనియర్ సిటిజన్స్ అంతా ఒకటే గోల మాకు అప్పర్ బెర్త్ వచ్చిందంటే మాకూ అప్పరేనండీ ' ఎక్కలేమూ , నాకు 74 అని ఒకరూ' నాకు ఎనభై ' అని ఒకరూ , 'నాకూ 65 ఐనా ఎక్కలేనండీ 'అని అప్పారావూ , ఇదండీ అప్పారావ్ ఎవర్ రిజర్వ్డ్ అప్పర్ బెర్త్ కథ!

సాఫ్ట్ వేర్ ఉద్యోగులు అప్పటికపుడు టికెట్ తత్కా ల్లో బుక్ చేసుకుని ఎలా సైడ్ లోయర్ బెర్తులు పొందు తారో అర్థంకాక అప్పారావేగాక సీనియర్ సిటిజన్స్ అంతా అయోమయావస్థలో పడ్డారు. అప్పారావ్ ఒక కాయితం తీసి అందరి చేతా సంతకాలు చేయించి , ' మావయస్సు చూసైనా మాకు లోయర్ బెర్తులు ఎందుకు అలాట్ చేయరూ?' అని –భ్1, భ్2, భ్3 బోగీలన్నీ తిరిగి సంతకాలు తీసుకున్నాడు , రైల్వే మంత్రికి పంపను. ఈ కాయితం ఆయన దాకా పోయి నప్పుడు అప్పారావ్ లాంటి వారి కష్టాలు తీరుతాయేమో చూద్దాం.. లెట్ అజ్ వైట్ అండ్ సీ..




“సారీరా... రీనీకన్నా!” కూతురి ముఖం చూడలేనట్లు తల దించుకుని అపాలజీ చెపుతున్న తల్లిని ఆనందంగా చూస్తూ... రేపటి ప్రోగ్రాం తన్నేసిందా ? చేతులు పట్టుకుని వూపేస్తూ అడిగింది ధరణి వురఫ్ రీనీ ..ద బ్యూటిఫుల్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ఆఫ్ గూగుల్ ఇండియా

“అవును.     మీడాడీ ఫోన్ చేసారు..” నిరసంగా చెప్పింది రీని తల్లి వాణి.

హేట్సాప్     టు డాడీ..గెంతులేసింది ధరణి.”     తలపట్టుకుంది వాణి. ఎన్ని విధాల కన్విన్స్     చేసి ఈపెళ్లి చూపులకి ఒప్పించగలిగారో గుర్తుకు తెచ్చుకుంది.

“అమ్మా..నాన్నా! మీకోదండం..పెళ్లిచూపులకోదండం..నాకుయిష్టం లేదంటే వినరే?

ఇప్పుడు నా ఏజ్ ఎంతని ? నాపేరు ప్రమోషన్ లిస్ట్ లో వుంది . తొక్కలో పెళ్లిచూపులని పేరంటాలని డుమ్మాలు కొట్టుకుంటూ పోతే ప్రమోషన్ కాదు ఉద్యోగమే ఊడిపోతుంది!     ధరణి ఆవేశపడిపోయింది. తను కూడా ఆవేశపడిపోతుంటే     అ ప్పుడు వాళ్ల నాన్న కలిగించుకున్నారు ,” తల్లీ రీని ! ఐథింక్ యు నో యువర్ డాడ్ .     సంజయ్ నా క్లోజ్     ఫ్రెండ్ రఘురాం కొడుకు . మాఇద్దరిదీ ఒకే వూరు ఒకే స్కూలు. వాడి సర్వీసంతా కర్నాటకలో గడచిపోయింది .ఈమధ్యే ట్రాన్స్ఫరై వచ్చాడు. వాడేమిటో నాకు నేను     ఏమిటో     వాడికి పూర్తిగా తెలుసు .మనలాగే ఆడంబరాలు ఆర్భాటాలు లేని     కుటుంబం వాడిది . కట్నాల కతీతంగా ఇద్దరబ్బాయిల పెళ్లిళ్లు చేశాడు. సంజయ్ ఆఖరి వాడు.నాతో     వియ్యమందాలని వాడి ఆశ. ముందు మా రీని     యస్సనాలన్నాను. వాడు దానికి యస్సన్న తర్వాతే నేని ప్రోగ్రాం ఏర్పాటు చేసాను. మీ అమ్మ వూహించినట్లు పెళ్లిచూపులు కాదు.. పరిచయ వేదిక మాత్రమే. సంజయ్ వాళ్లు రావడానికి ఇంకా చాలా రోజులు     టైముంది.     ఈలోగా ఫేస్ బుక్ స్టడీ చెయ్. ఫోన్ లో మాట్లాడు. నువ్వు ఓకే అంటేనే ప్రోగ్రాం.”అంటూ రకరకాలుగా కన్విన్స్ చేయడానికి భర్త పడిన పాట్లు ఆమె కళ్ల ముందు కదిలాయ్.     పడిన కష్టమంతా     ఒక్క పోన్ కాల్ తో కకావికలై పోతున్నాయని తాను బాధపడుతూ వుంటే ఇదేమో ఆనందంతో గంతు లేస్తోంది ! వాటే జనరేషన్ ? అనుకుంటూ వాణీ     తెగ బాధ పడిపోతుంటే.. “తొక్కలో ప్రోగ్రాంకోసం రెండు రోజులు సెలవుపెట్టాను. రానిమీ వార్ని..మా డాడి ఆవకాయ్ జాడీని..దులిపేస్తా..ఏదో అందంగా వున్నాడు..అమ్మా నాన్నల్ని వదిలి విదేశాలకు పోనన్నాడని..పోస్లే పాపం అని యస్సంటే ..యిలా

చెయ్యిస్తాడా ? దేఖేంగే..ధిఖాయేంగే ..అమ్మాయిలంటే యింత అలుసా?     ఫైవ్ సిక్స్ హైటూ ఫిఫ్టీసిక్స్ వెయిటూ జాస్మిన్ వైటూ వున్న నన్నే ఇగ్నోర్ చేస్తాడా ? అసలు దీనికంతా కారణం మీ ఆయన కదూ.? .వస్తారుగా రానీ బేంక్ మేనేజర్ ..రంగనాయకమ్మగారి స్వీట్ హోం హీరో..”అంటూ రాబోయే వాళ్ల నాన్నని ..రావడంలేదని ఫోన్ చేసిన సంజయ్ ని సహస్ర నామాలతో అభిషేకంచి అలిసిపోయి అందినవన్నీ లాగించేసి ముసుగు తన్నేసింది … ..అలనాటి సత్యభామ లెవెల్లో …ధరణి ద మోస్ట్ బ్యూటిఫుల్ సాఫ్ట్ వేర్ యింజినీర్.

******     ******     *****

ఉదయం పదైపోయింది .ఇంటిముందు జరుగుతున్న కోలాహలానికి లేచి కళ్లు నులుముకుంటూ బాల్కనీలోకొచ్చి కనిపించిన దృశ్యాన్ని చూస్తూనే అందమైన ప్రతిమలా ఫ్రీజై పోయింది ధరణి ! ఇన్నోవాలోంచి దిగుతున్న సంజయ్ ని అతని ఫ్యామిలీ మెంబర్స్ ని గుర్తుపట్టి గాబరాపడిపోయి ఒక్క గెంతులో బాత్ రూంలోకి జంపై పోయింది .

****** ****** ******

"అంకుల్ ! నిన్న మేమంతా ..ఇవాల్టి ప్రోగ్రాం గురించి మాట్లాడుకుంటుంటే ..జానకిరాం అంకుల్ వచ్చారు. విషయమంతా విని పకాపకా నవ్వేసారు !

పెళ్లిచూపులేంట్రా పిచ్చోడా..ఆ రోజు అపోలో హాస్పిటల్లో నా ప్రాణదాత..మాఆఫీస్ అమ్మాయి అని చెప్పాను గుర్తుందా ? ఎంగ్ అండ్ ఎనర్జిటిక్ మరో మదర్ థెరీసా అని కూడాచెప్పాను.!.ఆ అమ్మాయే ఈ అమ్మాయని చెప్పారు.

ఆ రోజు అంకుల్ కి హార్ట్ ఎటాక్ రావడం..తనే అపోలోలో అడ్మిట్ చేయించి వారం రోజులు కంటికి రెప్పలా చూసుకోవడం చెప్పి ..మరో మాటన్నారు..." ఆగిపోయాడు సంజయ్, ధరణి హార్ట్ బీట్ పెరిగి పోయింది. రాత్రంతా తను సహస్ర నామాలతో తిట్టి పోసిన వ్యక్తి నోటి మాటకోసం ఆతృత పడిపోవడం వింతగా అనిపించింది .చెప్పుబాబూ.. చెప్పు,,మనసు లోనే మదనపడిపోయింది

సంజయ్ ఓసారి ధరణి వంక చిలిపిగా చూశాడు.

లబ్..డబ్ లు మరింత లౌడై పోయాయి ..

"ఔన్రా..అన్నాను..యిప్పుడూ అంటాను..పెళ్లిచూపులు ఆ అమ్మాయికి కాదు..నీకు ఏర్పాటు చేయమని మీ డాడీని రిక్వెస్ట్ చెయ్..ఆ అమ్మాయి నిన్ను చూసి ఓకే అంటే నిన్ను మించిన అదృష్టశాలి ఈ ప్రపంచాన మరొకడుండడు..అన్నాను. అంతేకాదు ..మరో మాట కూడా అన్నాను..గుర్తుందా ? సంజయ్ ని సూటిగా చూశారు జానకిరాం.

ఆ మాటెలా మర్చిపోతానంకుల్ ? మరింత మిశ్చివస్ గా నవ్వాడు.

నవ్వులాపి అదేంటో త్వరగా చెప్పుబాబూ,,మనసులోనే మననం చేసుకుంది రీనీ..

“అరే రఘురాం..నీ దోస్త్ బుచ్చిబాబుగారిని అడుగు..నా ముద్దుల కూతురు ఫేస్బుక్ హీరోయిన్ స్రవంతిని ఛాటింగ్ హీరో ప్రవీణ్ ని తీసుకుని ఇన్ ఎక్స్చేంజ్ ధరణిని యిస్తారేమోనని.

ఆయన ఓకే అంటే సంజయ్ ని నేనే అల్లుడిగా చేసేసుకుంటా..”

ఇదేగా అంకుల్ మీరన్న మాట? అందుకే అమ్మాయిని చూసే ప్రోగ్రాం కేన్సిల్ చేసేశాను.

మీ మాట ప్రకారం నా పెళ్లిచూపుల కార్యక్రమం డిఫరెంట్ గా వుండాలని అంకుల్నిబ్రతిమాలి ఇక్కడ ఏర్పాటు చేసుకుని బంధుమిత్ర సపరివారంగా వచ్చేశాను.

నన్ను చూసి మీ అమ్మాయి యస్ అంటే మీ యిద్దరిలో ఎవరికైనా అల్లుడినైపోవడానికి నేను రెడీ అతి వినయంగా చెప్పిన సంజయ్ మాటలు వింటూనే అందరూ థ్రిల్లై పోతే ..ట్విస్ట్ ను అర్థం చేసుకుని లైట్లు వెలిగించుకున్న ధరణి “డాడీ” అని అరవబోయి..ముసిముసి నవ్వులు పూయించేసింది !

“ అంకుల్ ! మీ అమ్మాయి ఏదో ఒకటి చెప్పేస్తే మేం స్టారో మూనో ఏదో హోటల్ కి షిఫ్టయిపోతాం ..ఆకలి దంచేస్తోంది . ఇక్కడ కతికితే అతకదంటారుగా.. అందుకని..”

అమాయక చక్రవర్తిలా అభినయిస్తున్న సంజయ్ ని చూస్తూ “..సిగ్గుపడడానికే సిగ్గుపడే చినదాని బుగ్గల్లో సాఫ్ట్ గా సిగ్గులు పూయించేశావ్, పెదాలు విప్పకుండానే మనో రాగాలు పలికించేలా చేశావ్ ..స్టారు పుడ్డుతోబాటు తతంగాల హెడ్ కూడా మరో గంటలో మనముందుంటారు . రండి అన్నయ్యగారూ..మనమలా మేడమీద కెళ్లి వీళ్లకో యుగళగీతానికి ఛాన్స్ యిచ్చేద్దాం ”అంటూ చిలిపిగా మాట్లాడుతూ కదలబోతున్న తల్లిని కౌగిలించేసుకుని ముద్దుపెట్టేసి ..బుచ్చిబాబురాణీ నాటకాలవాణీ..రాత్రికిచూపిస్తా నాబాణీ ..అంటూ చెవి కొరకేసి.. అందరిని చిరునవ్వుతో పలకరించి వినయంగా నమస్కరించి

“పెళ్లిచూపుల్ని స్వయంవరంగా రూపు దిద్దిన మిష్టర్ సంజయ్ అండ్ డాడీ మమ్మీల చతురతకు వెల్కం చెపుతూ సంజయ్ మీద నా అభిప్రాయాన్ని యుగళ గీతాల ఐమీన్ యుగళ బాతాల పిమ్మట మనవి చేస్తానని మనవి చేస్తున్నాను”

సీతా స్వయంవరంలో రాముడు శివధనుస్సును విరిచినప్పుడు సభాసదుల గుండెలు గుభిల్లు మన్నట్లు ధరణి సంధించిన వాక్కుల బాణం వైబ్రేషన్స్ క్రియేట్ చేస్తే సంజయ్ హార్ట్ మాత్రం సడన్ గా ఆగిపోయి తిరిగి స్టార్టయింది.

****** ******

“మమ్మీ ! క్లైమాక్స్ లో కరెంట్ పోయినట్లు ఈ డైరీలో మిగతా పేజిలన్నీ బ్లాంక్ గా వున్నాయ్ . ఆ తర్వాత ఏమైంది మమ్మీ? “ ధరణిని ఊపేస్తూ గారాలు పోయింది ధరణీ సంజయ్ ల గారాల పట్టి కార్తిక. ముసిముసిగా నవ్వేసింది సంజయ్ ని ఓరకంట చూస్తూ ధరణి “సస్పెన్స్ తో చచ్చిపోతుంటే నవ్వులేంటి మమ్మీ ! ప్లీజ్ ప్లీజ్..” రిక్వెస్ట్ చేసింది కార్తిక .

ఇందులో సస్పెన్స్ ఏముందిరా ..మమ్మీ డాడీల పెళ్లి..పుట్టిందో డాలి..దట్సాల్..

మమ్మీ ! మరీ నాకు సాఫ్ట్ వేర్ ఫ్లవర్స్ పెట్టకు . యుగళగీతాలో ..యుగళ బాతాలో తర్వాత ఏమైంది ?

ఓ..అదా నీ డౌటు..? వున్నారుగా మీ డాడీ ..అడుగు..చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తూ గత స్మృతుల గంధాన్ని బుగ్గలకు బుక్కాలా చల్లేసుకుంది ..

“డాడీ ! గీతాలో..బాతాలో..బోల్ ..డాడీ..బోల్..” ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

“సాహసంతో స్వయంవరానికి వచ్చాను కదాని ..చెమటలు పట్టించే చింతామణి ప్రశ్నలు సంధిస్తుందేమోనని

భయపడి పోతుంటే..జానకిరాం అంకుల్ మాటల్ని నిజంచేస్తూ ..మనం మన వూళ్లో..తాటాకు పందిరి క్రింద తలంబ్రాలు పోసుకోవాలి..నా పెళ్లికి మా డాడీ ఖర్చు పెడతానన్న బడ్జెట్ లో సగ భాగం నేను చదవుకున్న మన వూరి స్కూలు బాగుకోసం

డొనేట్ చేయాలి..మనం ఆడంబరాలకు ..ఆర్భాటాలకు దూరంగా వుండాలి..”

ఇదేరా తల్లీ ..మీ మమ్మీ మాట..నా పాలిట బంగారు బాట..కోట్లు దుబారా చేస్తూ ..ఫేస్ బుక్ పోస్టింగులకోసమో ఫ్రెండ్ సర్కిల్ పొగడ్తలకోసమో..కన్నవారిని ..కష్టాలకు గురి చేస్తున్న నేటి యూత్ కు గుణపాఠంలా వున్నమీ మమ్మీమాటలు నా కు అమృత ధారలయ్యాయి..”

మరి స్కూల్ ? కార్తిక కంఠంలో క్యూరియాసిటీ.. “తాతయ్యలిద్దరూ ..టాయిలెట్స్ కట్టించారు..పేదపిల్లలకు ..యూనిఫామ్స్ కుట్టించారు..ఇంకా..” దట్ మీన్స్ కన్నవూరిని కన్న తల్లిలా చూసుకున్నారన్న మాట..ఐయామ్ ప్రౌడాఫ్ఫ్యు ఆల్ డాడీ డాడీకి ముద్దు పెట్టి ,అమాంతం లేచి వెళ్లి..మమ్మీని చుట్టేసి..ముద్దుల వర్షం కురిపించేసి తల్లి ఒడిలో తల వాల్చేసి.”.నీ కూతురిగా పుట్టడం నా అదృష్టం మమ్మీ..ఐ విల్ ఫాలో ..యువర్ గోల్డెన్ ఫుట్ స్టెప్స్..ఇట్స్ మై ప్రామిస్..”

ఆనందంతో మాటలు రాక మూగ పోయింది ..కార్తిక,,లవ్ లీ డాటర్ ఆఫ్ ..ధరణి..ద సాఫ్టవేర్ అమ్మాయి



"ఏందిరా యాద్ గిరీ పండావు, డాక్టర్ సాబ్ ఇంటికి బోలే" స్టూడియోలోకి వస్తూ , బెంచి మీద పడుకొని వున్న యాదగిరి ని అడిగాడు వెకటేశ్.

"లేదన్నా కడుపులనొస్తోంది. నువ్వొచ్చినంక చెప్పి ఇంటికిబోదమని పండుకొన్నా."జవాబిచ్చాడు యాదగిరి.

"బయట తినొద్దురా అంటే వినవ్. ఏం తిన్నవురా ? "అడిగాడు వెంకటేశ్.

"ఏం తినలేదన్నా."మూలుగుతూ జవాబిచ్చాడు.

"మరి డాక్టర్ సాబ్ ఇంటికి రఘుబోయినాడు రా ?"అడిగాడు వెంకటేశ్.

"లేదన్నా , వాడి తాత దినాలని వూరెళ్ళిండు."

"ఎన్ని సార్లు దినాల కెళుతాడురా?" విసుక్కుంటూ "శ్యాం ఏడి ? వాడెళ్ళిండా?" అడిగాడు.

"లేదన్నా వాడి అమ్మకు బాగలేదట, దవఖానా కు తీసుకెళ్ళిండు."

"ఓరినీ దుంపలైగ అందరికీ ఈ రోజే ఏమొచ్చిందిరా?"కంగారుపడిపోయాడు వెంకటేశ్.

"అన్నా ఇగనేనింటికి బోతా."ముక్కుతూ మూలుగుతూ వెళ్ళిపోయాడు యాద్ గిరి.

ఇంక తప్పదన్నట్లు తనే విడియో తీసుకొని, పని కుర్రాడు సాయి ని బతిమిలాడి బామాలి వెంటతీసుకొని వెళ్ళాడు.పెళ్ళి హాల్ లో కెమెరామాన్ శేషు వెనక వరసలో దిగాలుగా కూర్చొని వున్నాడు!

"ఏమైందన్నా అట్లా వున్నావు?" అని అడిగాడు వెంకటేశ్.

"మా పోరగాళ్ళందరూ రాకుండా తప్పించుకున్నారు.ఎందుకా అనుకున్నాను, ఇక్కడికొస్తే తెలిసింది, ఇక్కడ అందరికీ కళ్ళకలకలు వచ్చాయి.కనిపిస్తలే , అందరూ నల్లకళ్ళద్దాలు పెట్టారు."అన్నాడు శేషు.

"హోరినీ ఇందుకా మా పోరగాళ్ళు కూడా తప్పుకున్నారు."ఆశ్చర్యపోయాడు వెంకటేశ్.

ఇంతలో పెళ్ళి తంతు మొదలైందని వీళ్ళను రమ్మని పిలిచారు. ఏమైనా మనం తప్పించుకోలేము కదా అని ఒకరినొకరు దీనంగా చూసుకుంటూ , తమతమ సరంజామా సద్దుకొని లేచారు.

సన్నాయి వాళ్ళు శ్రావ్యం గా వాయిస్తున్నారు.మల్లెపూల సువాసనలు గాలిలో తేలి వస్తున్నాయి.చిన్నపిల్లలంతా కళ్ళద్దాలు సద్దుకుంటూ సరదాపడిపోతూ హాలంతా పరుగులుపెడుతున్నారు. హాలంతా సందడి సందడిగా వుంది. ఒకరిమాట ఒకరికి వినిపించకపోయినా గొంతు పెంచి మరీ గలగలా మాట్లాడేసుకుంటున్నారు.అథిదులు ఒకరొకరుగా వస్తున్నారు. హాల్ బయట నల్ల కళ్ళద్దాలు అమ్ముకుంటున్న అతనిని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఏ పెళ్ళి హాలు ముందైనా బూరలు, బూజు మిఠాయి లాంటివి అమ్ముకుంటారు. కాని ఇక్కడ ఏమిటి నల్ల కళ్ళద్దాలు అమ్ముతున్నారు అనుకుంటూ లోపలికి వస్తే అంతా కళ్ళ జోళ్ళ తో కనిపించారు.

"అదేమిటండీ , ఈ పెళ్ళి లో నల్ల కళ్ళద్దాలు పెట్టుకోవాలని ఏమైనా డ్రెస్ కోడ్ ఏమైనా పెట్టారా?" వింతగా పరంధామయ్య , వెంకట్రావును అడిగాడు.

"అబ్బే లేదండి . వూళ్ళో కళ్ళకలక వుంది కదా , పెళ్ళింట్లో అందరికీ వచ్చింది. ఇక్కడేదో లాభసాటి బేరం అనుకొని కళ్ళజోడు షాప్ వాడు మొత్తానికి ఇక్కడే అమ్మకాలు మొదలు పెట్టాడు. ఎందుకైనా మంచిది మీరు ఓటి పెట్టుకోండి . మీకు రాకుండా వుంటుంది ."అన్నాడు. భోజనాల దగ్గర అందరిని కనుక్కుంటూ తిరుగుతోంది సుభద్ర. మామ్మగారు సుభద్రను పిలిచి "అమ్మాయ్ కొత్త నెక్లెస్ కొన్నావుటే , చూపించు అంది."

"లేదు మామ్మా జాకెట్ కు నెహ్రూ కాలర్ పెట్టించుకున్నాను. దాని మీద ఎంబ్రాయిడరీ చేసుకున్నాను. అది నీకు కళ్ళద్దాలలో నుంచి నెక్లెస్ లా కనిపిస్తున్నట్లుంది ." అంటూనే అటుగా చేతిలో ఐస్క్రీం తో వెళుతున్న చింటూ ని రెక్క పట్టుకొని ఆపి, "వెధవా ఇది ఎన్నో ఐస్క్రీం రా ?"అని గదమాయించింది.

"అమ్మా నీకు కనిపిస్తోందా ?" ఆశ్చర్యంగా అడిగాడు చింటూ.

"ఏరా నాకు కనిపించదనుకొని ఇన్ని తినేస్తున్నావా ?వెధవా మళ్ళీ ఐస్క్రీం దగ్గరకు వచ్చావంటే నాలుగు తగిలిస్తాను."అని కోపం చేసి వాడిని వదిలేసింది.

పెళ్ళి కూతురిని తీసుకొచ్చి పీటల మీద కూర్చో పెట్టారు.మధ్యలో తెర పట్టారు. ముహూర్తానికి ఇంకా సమయము వుందని పెద శాస్త్రులుగారు ఏవో మంత్రాలు చదువుతున్నారు. ఇదే సందని పెళ్ళికొడుకు గోపి తెరను కొంచం కిందికి దించబోయాడు. చిన్న శాస్త్రులుగారు తెర పట్టుకొని "అయ్యా పెళ్ళికొడుకు గారూ మీరలా చూడకూడదు " అన్నాడు.

"శాస్త్రులుగారూ, ఈ నల్ల కళ్ళాద్దాల వారు , అసలు పెళ్ళికూతురినే తెచ్చారో , ఇంకెవరినన్నా తీసుకొచ్చారో ఓసారి చూడనీయండి."అన్నాడు గోపి.

"పెళ్ళికుమార్తె గారి అన్నయ్య మీ స్నేహితులేనట కదా ? వారు పొరపాటు ఎందుకు పడతారు?" అని ప్రశ్నించాడు చిన్న శాస్త్రులు గారు."అదేనండి సమస్య. ముందే వాడికి పెళ్ళికాకుండా నాకైతోందని కుళ్ళుకుంటున్నాడు.ఇప్పుడు పొరపాటు చేసాననటానికి వీలు చిక్కింది. మీకు తెలిదండి , పెళ్ళికూతురు మారిపోతే నా కొంప కొల్లేరవుతుంది.నన్ను చూడనీయండి."

“అయ్యా పెళ్ళికొడుకు గారూ, మీరలా పేచీలు పెట్టకూడదు. "

"ఏమిటీ నేను నిన్ను చూసి కుళ్ళుకుంటున్నానా ? నాకు తోచలేదు ఏ ఎత్తుపళ్ళు, మెల్లకన్ను వున్నదాన్నో తేవాల్సింది తిక్క కుదురేది." పెళ్ళికూతురు అన్న సుధీర్ పోట్లాటకు దిగాడు.

"ఊ ఊ ఇక సమయమైంది. పెళ్ళికొడుకుగారూ మీ చేయి ఇలా ఇవ్వండి "అంటూ చేయి అందుకున్నారు పెద్దశాస్త్రులవారు.

"అయ్యో అయ్యో నేను పెళ్ళికుమారుని కాదండి. వాడి తండ్రిని. శాస్త్రులు గారు కాస్త జాగ్రత్తగా గమనించి చేయండి. లేదా మీ కళ్ళ జోడు తీసేయండి ."అని కొంచం కోపంగా అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అయ్యా క్షమించండి. కళ్ళజోడు తీస్తే కష్టం కదండి . జాగ్రత్తగానే వుంటాను లెండి ."అని వధువు, వరునితో జీలకర్రాబెల్లం పెట్టించి తెరతీసారు శాస్త్రులు గారు.

"బాబూ పెళ్ళికొడుకు గారూ, అమ్మా పెళ్ళికూతురుగారూ మీరిరువురూ ఒకరినొకరు చూసుకోండయ్యా . ఈ శుభముహూర్తాన మీ చూపులు కలవాలి."అన్నారు శాస్త్రులు గారు.

గోపీ, రేఖా కళ్ళద్దాలు తీసారు .ఒకరినొకరు చూసుకున్నారు . ఇద్దరి కళ్ళూ ఎర్రగా నిప్పుఖణికలలా వున్నాయి .కళ్ళద్దాలు తీయగానే కళ్ళ నుంచి జలజలా నీరుకారి మసకగా ఐపోయాయి.

"ఏ చూపులు కలవటమో అసలు చూడటమే కష్టమైపోతోంది. సన్నాయి వాళ్ళూ చూపులు కలసిన శుభవేళా అని కాదయ్యా , చూపులుకలవని శుభవేళా అని వాయించండి ." అని గొణిగాడు పెళ్ళికొడుకు!




"ఆశయం నా శ్వాస. ఆదర్శం నా ఊపిరి. ప్రేమికుల్ని విడదీయడం పాపం అనుకునేవారిలో నేను ప్రథముణ్ణి" అన్నాడు కుక్కుటేశ్వర్రావు.

"శ్వాస, ఊపిరీ...రెండూ ఒకటేనేమో నాన్నా!" అన్నాడు చంద్రం తండ్రి చెవిలో.

"ఐతే అయ్యాయిలేరా. ఎఫెక్ట్ కోసం అలా అన్నాన్లే" అన్నాడు కుక్కుటేశ్వర్రావు మెల్లగానే.

"ఆశయం, ఆదర్శం వంటి పెద్ద మాటలు నాకు తెలియదుగాని...నా కొడుకు అభీష్టాన్ని నెరవేర్చాలనే ఇంగితం మాత్రం ఉంది" అన్నాడు పరమేశ్వర్రావు నవ్వుతూ.

పరమేశ్వర్రావు కొడుకు రఘు, కుక్కుటేశ్వర్రావు కూతురు జలజ ప్రేమించుకున్నారు. రెండేళ్ళ యూనివర్శిటీ ప్రేమ - డిగ్రీలు చేతికి వచ్చి, రఘుకి జాబ్ కూడా రావడంతో పెళ్ళి ప్రస్తావనకు దారి తీసింది. మధ్య తరగతికి చెందిన పరమేశ్వర్రావుకీ ఓ కూతురు ఉంది. ఆ కట్నాల జగతిలో కూతురి పెళ్ళి చేయడం కొంచెం కష్టమే అతనికి. ఐతే, 'కొడుక్కి కట్నం తీసుకుని, అది కూతురికి కట్నంగా ఇచ్చి పెళ్ళి చేసేస్తే సరి. ఈ మాత్రానికే బెంబేలుపడిపోతావేమిటోయ్?' అని ఇటు బంధువులు, అటు స్నేహితులూ అనడంతో, అదీ

బాగానే ఉందనిపించింది. కాని, కొడుకు ఓ అమ్మాయిని ప్రేమించాననీ, ఆమెనే పెళ్ళాడతాననీ చెప్పడంతో కాదనలేకపోయాడు. ఎంత ప్రేమ వివాహమైనా, పిల్ల తండ్రి కాస్తో కూస్తో కట్నం ఇవ్వకపోతాడా అనుకున్నాడు.

ఐతే కుక్కుటేశ్వర్రావు ఘటికుడు. 'కొడుక్కి కట్నం తీసుకోవాలి, కూతురికి కట్నం ఇవ్వకూడదు' అన్న తరహా మనిషి. రఘు తన కూతుర్ని ప్రేమించాడనీ, అతని పెద్దలు అందుకు వ్యతిరేకులు కారనీ తెలియడంతో రాజకీయం ఆడాడు. "కట్నం అనండి, కానుకలనండి...కూతురికి అంతో ఇంతో ఇచ్చి పంపాలని ఏ తండ్రికైనా ఉంటుంది, బావగారూ! కాకపోతే ఇది ప్రేమ వివాహం. నేను ఏమైనా ఇస్తే వారి ప్రేమను అవమానించినట్టవుతుంది. అందుకే మా అమ్మాయికి కట్నం ఇవ్వదలచుకోలేదు నేను" అన్నాడు కుక్కుటేశ్వర్రావు నిస్సిగ్గుగా. పరమేశ్వర్రావు అవాక్కయ్యాడు. అక్కడికీ కూతురి పట్ల తాను నిర్వహించవలసిన బాధ్యతను గూర్చి పరోక్షంగా ప్రస్తావించాడు కూడాను. ఏమీ అర్థంకానట్టే ప్రవర్తించాడు కుక్కుటేశ్వర్రావు. పరమేశ్వర్రావు ఏమీ అనలేకపోయాడు.

రఘు, జలజల వివాహం జరిగిపోయింది. పైసా కట్నం ఇవ్వకుండా కూతురి పెళ్ళి సజావుగా జరిపించినందుకు తనను తానే అభినందించుకున్నాడు కుక్కుటేశ్వర్రావు. కొడుక్కి మాత్రం మంచి కట్నం ఇచ్చే సంబంధం కోసం వల విసిరాడు. ఆ లోపున కొడుకు, తన అల్లుడిలాగ పిచ్చి పనేదైనా చేస్తాడేమోనని, "ప్రేమా దోమా అంటూ పిచ్చి పిచ్చి వేషాలెయ్యమోకు. మనకు కిట్టుబాటు కాదు. బోలెడు తగలేసి చదివించాను నిన్ను. నాకు నచ్చిన అమ్మాయితో నీ పెళ్ళి జరిపించే పూచీ నాది" అంటూ చంద్రం ముందు కాళ్ళకు బంధం వేసాడు. చంద్రం మెతక మనిషి. "అలాగే నాన్నా!" అంటూ తలూపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జలజకు అన్నను చూస్తే గంగిరెద్దు గుర్తుకొచ్చింది.

కొడుక్కి ఎన్నో సంబంధాలు చూసాడు కుక్కుటేశ్వర్రావు. అమ్మాయి అందంగా ఉంటే, సంగీతం రాదని వద్దన్నాడు. సంగీత సరస్వతి ఐతే, అందం లేదన్నాడు. రెండూ ఉంటే, మరేదో కొరత చూపించేవాడు. రంగు లేదనో, పొంగు లేదనో, హంగు లేదనో ఏదో ఒక వంక పెట్టి వచ్చిన సంబంధాలన్నీ త్రిప్పికొడుతున్నాడు. నిజానికి చంద్రానికి తాను చూసిన అమ్మాయిలందరూ బాగానే కనిపించారు. వాళ్ళంతా తండ్రికి ఎందుకు నచ్చలేదో అర్థమయ్యేదికాదు.

ఓసారి జలజతో "ఆఫీసులో అంతా ముదురు బెండకాయి అని నిక్ నేమ్ తో పిలుస్తున్నారే నన్ను," అంటూ వాపోయాడు ముప్పై ఐదేళ్ళ చంద్రం.

"మరి కొన్నాళ్ళు ఇలాగే సాగిందంటే పెళ్ళిచూపుల కొడుకుగా మిగిలిపోతావే తప్ప, నువ్వెప్పటికీ పెళ్ళికొడుకువి కాలేవురా అన్నయ్యా! చదువుకున్నావు, చక్కటి ఉద్యోగం చేస్తున్నావు. జీవిత భాగస్వామి విషయంలోనైనా కాస్త స్వతంత్రంగా ప్రవర్తించరా" అంటు సన్నగా అన్నను మందలించింది ఆమె.

అన్నగారి నిశ్చితార్థపు సమయంలోను, పెళ్ళిలోను చంద్రాన్ని చూసిన రఘు చెల్లెలు సంధ్యకు అతనిపైన సదభిప్రాయం ఏర్పడింది. ఓసారి జలజతో, "వదినా! మీ అన్నయ్య నాకు నచ్చాడు. ఇది ప్రేమ అనను. అతనంటే నాకిష్టం. అంతే. అతనికీ ఇష్టమైతే అతని ఇల్లాలిని కావాలనుకుంటున్నాను నేను," అంటూ సిగ్గుకు కాసేపు ముసుగేసి తన మనసులోని మాటను బైటపెట్టింది. ఆ ఆలోచన జలజకూ ఉంది. కాని తండ్రి సంగతి ఎరిగున్నందున ఆ ఆలోచనను తనలోనే అణచుకుంది. ఇప్పుడు ఆడపడుచు తనంతట తానుగా తన అభీష్టాన్ని వెలిబుచ్చడం సంతోషం కలిగించింది.

ఆ విషయం భర్తతో చెప్పింది. అతను తల్లిదండ్రులతో చెప్పాడు. అప్పటికే కూతురుకి సంబంధాలు చూస్తున్నారు వాళ్ళు. చంద్రం వారి దృష్టిలో ఉన్నా, కుక్కుటేశ్వర్రావు తత్వానికి జడిసి వెనుకాడాడు పరమేశ్వర్రావు. ఇప్పుడు చంద్రమంటే కూతురు ఇష్టపడుతోందని తెలిసి కుక్కుటేశ్వర్రావును కలసి ప్రతిపాదన చేసాడు.

చంద్రం, సంధ్యను చూసియున్నాడు. ఆమె అందగత్తే కాదు, చదువుకున్నదీ నెమ్మదైనదీను. తండ్రి నీడలో ఉండిపోయిన అతనికి ఆ పిల్లను చేసుకోవాలన్న ఆలోచన అంతవరకు తట్టలేదు. ఇప్పుడు జలజ మావగారు వచ్చి అడిగితే, తండ్రి వంక ఆశగా చూసాడు, ఒప్పుకుంటే బావుండునని.

వియ్యంకుడి ప్రతిపాదన గురించి క్విక్ గా ఆలోచించాడు కుక్కుటేశ్వర్రావు. మదిలోనే ఏవేవో లెక్కలు వేసాడు...పరమేశ్వర్రావు కాలేజ్ లెక్చరర్ గా వెనకేసిందేమీ లేదు. తాను కోరిన కట్నం ఇచ్చుకోలేడు. తన ఎక్స్ పెక్టేషన్స్ కి అతను తూగలేడు. పైగా కూతురికి తాను పైసా కట్నం ఇవ్వలేదు. ఇప్పుడు అతన్ని కొడుక్కి కట్నం అడగడం బావుండదు.

అందుకే, "ఈ ఆలోచన నాకు అమ్మాయి పెళ్ళిలోనే వచ్చింది, బావగారూ! కుండమార్పిడి అవుతుందని ఊరుకున్నాను. మన కుటుంబాలలో కుండమార్పిడి పెళ్ళిళ్ళు జరుగవుగదా! అమ్మాయికి మంచి సంబంధం చూసి చేద్దాం" అంటూ లౌక్యంగా 'నో' చెప్పేసాడు.

వియ్యంకుడు నిరాశ చెందితే, చంద్రం హతాశుడయ్యాడు. తండ్రి ఎదుట కిక్కురుమనే ధైర్యం లేదు అతనికి. ఆ తరువాత మూణ్ణెల్లకే సంధ్య పెళ్ళయిపోయింది. మరో ఆర్నెల్లకు చంద్రానికి కూడా సంబంధం కుదిరింది. ఎంతో క్లోజ్ స్క్రీనింగ్ తరువాత కుదిరిన సంబంధం కావడంతో, పిల్ల ఎంత అందంగా ఉంటుందో చూడాలన్న కుతూహలం కలిగింది సంధ్యకు. పెళ్ళికి తానూ వచ్చింది.

పెళ్ళికూతురు గౌరి పల్లెటూరి పిల్ల. చామనచాయకు తక్కువగా, కొంచెం బొద్దుగా ఉంటుంది. చిన్న మెల్ల కూడా ఉంది. పెద్దగా చదువుకోలేదు.

గౌరిని చూసి విస్తుపోయింది సంధ్య. "అమ్మాయిలెవరూ మీ అన్నయ్యకు ఓ పట్టాన నచ్చడంలేదనీ, అందుకే చాలా సంబంధాలు చూడవలసి వచ్చిందనీ ఆలకించాను. ఈ మెల్లకన్ను నల్ల పిల్ల ఎలా నచ్చింది, వదినా!?" అనడిగింది జలజను రహస్యంగా. జలజ పెద్దగా నవ్వి, "నచ్చనిది  అన్నయ్యకు కాదు, మా నాన్నకు. నాన్నకు నచ్చవలసింది కన్య కాదు, కట్నం!" అంది. "గౌరి తెచ్చే లక్షల కట్నం ముందు ఆ పిల్ల మెల్లకన్ను మా నాన్నకు ఆనలేదు మరి!"

సంధ్య తెల్లబోయి, "ఆ అమ్మాయికి వంకలు పెట్టడం నా ఉద్దేశ్యం కాదుగాని...మీ అన్నయ్య ఎలా ఒప్పుకున్నారా అని ఆశ్చర్యంగా ఉంది" అంది.

"మా అన్నయ్య గంగిగోవే కాదు, గంగిరెద్దు కూడాను. అమ్మానాన్నల కూచి. వారు గీచిన గీటు దాటడు" నవ్వింది జలజ. "నిజానికి నిన్ను చేసుకోవాలని ఉవ్విళ్ళూరాడు అన్నయ్య. మావయ్యగారు తాను కోరిన కట్నం ఇచ్చుకోలేరని, కుండమార్పిడి వంకతో కొట్టిపారేసాడు మా నాన్న".

రెండేళ్ళ తరువాత - ఎందుకో పక్క ఊరికి వచ్చిన సంధ్య, వదిన పుట్టింటికి వెళ్ళింది, ఆమె తల్లిదండ్రులను చూసివద్దామని. గేటు తీసుకుని లోపల ప్రవేశించిన సంధ్యకు ఇంటి చుట్టూ నందనవనంలా ఉన్న తోట కనువిందు చేసింది. పూలమొక్కలు, ఫల వృక్షాలతో, కూరగాయల మడులతో, పాదులతో నిండుగా కళకళలాడుతోందిప్పుడు. పంచెకట్టు, బనియన్ తో, తలకు తువాలు చుట్టుకుని పాదులకు బోదులు త్రవ్వుతూన్న వ్యక్తిని చూసి, తోటమాలిని పెట్టుకున్నారన్న మాట అనుకుంది.

గుమ్మంలోనే ఎదురు వచ్చిన గౌరి వంక పరిశీలనగా చూసింది సంధ్య...గౌరి ఇప్పుడు కొంత రంగు రావడమే కాక కాస్త ఒళ్ళు కూడా తగ్గింది...ప్రశ్నార్థకంగా చూస్తూన్న గౌరికి స్వపరిచయం చేసుకుంది.

"సారీ, అప్పుడు పెళ్ళిలో చూడ్డమే మిమ్మల్ని. ఆ తరువాత మనం మళ్ళీ కలుసుకోలేదుగదా. రండి," అంటూ లోపలికి ఆహ్వానించింది గౌరి చిరునవ్వుతో.

"బాగున్నావా అమ్మా?" అన్న పిలుపు వినిపించి అటువైపు చూసింది సంధ్య. హాల్లో మాపింగ్ చేస్తూన్న వృద్ధురాలు పలకరింపుగా

నవ్వింది. ఆమె వంక పరీక్షగా చూసిన సంధ్య విస్తుపోయింది. "మీరు...!?" "నేనేనమ్మా. చంద్రం తల్లిని" అని ఆవిడ జవాబివ్వడంతో చటుక్కున దగ్గరకు వెళ్ళి ఆవిడ చేతులు పట్టుకుని, "అత్తయ్య గారూ!?" అంది.

"చూసావా అమ్మా, నా కోడలు పెట్టే ఆరళ్ళు? ఇది ఇంట్లో అడుగు పెట్టిందో లేదో నన్ను పనిమనిషి కంటె హీనంగా చేసేసింది" అంటూ మదిలోని ఆవేదనంతా వెళ్ళగ్రక్కుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

సంధ్య తెల్లబోయి చూసింది. అత్తాకోడళ్ళ నడుమ సఖ్యత లోపించిందని అర్థమైపోయింది. వెలసిపోయిన చీర, జాకెట్టు, రేగిన జుత్తు, శుష్కించిన దేహం, పీక్కుపోయిన ముఖమూను. మనిషి నల్లబడింది. అంతకుమునుపు దర్జాగా దర్పంగా ఉండే ఆచిడకూ, ఈనాడు తాను చూస్తూన్న మనిషికీ పోలిక లేదు...ఆవిడ పట్ల జాలి కలిగింది. కాని, అది సున్నితమైన విషయమూ, మరొకరి కుటుంబ వ్యవహారమూ కనుక మాట మార్చుతూ, "మావయ్యగారు ఇంట్లో లేరా, అత్తయ్యగారూ?" అనడిగింది.

"బైట తోటలో కనిపించలేదామ్మా? మావగారనైనా చూడకుండా కూలోడి కంటె హీనంగా బండ చాకిరీ చేయిస్తోంది ఆయన చేత ఈ మహాతల్లి!" అంటూ అక్కసు కొద్దీ మెటికలు విరిచిందావిడ.

నివ్వెరపోయింది సంధ్య. 'తోటలో కనిపించిన మనిషి మావయ్యగారా! ఆ వేషం చూసి తోటమాలి అనుకుని పలకరించలేదు' అనుకుంది మదిలో. పైకి చిరునవ్వుతో, "తోట పని ఒంటికి మంచిదేగా అత్తయ్యగారూ! డెయిలీ గార్డెనింగ్ చేసేవారి ఆరోగ్యానికి ఢోకా ఉండదు తెలుసా?" అంది.

మూతి త్రిప్పుకుందావిడ. "తోటపని ఒక్కటే కాదమ్మా. పనివాడిలా బైటి పనులు కూడా చేయిస్తోంది ఆయన చేత" అంది. "ఐనా మన బంగారం మంచిదైతే కంసాలిననే అవసరమేముందన్నట్టు, నా కొడుకు చవటై పెళ్ళాం కొంగు పట్టుకుని తిరగబట్టేగా మాకీ పాట్లు!" అంతలో కుక్కుటేశ్వర్రావు అక్కడికి వచ్చాడు.

"ఈ అమ్మాయి ఎవరో గుర్తుపట్టారా? మనమ్మాయి ఆడపడుచు సంధ్య. మనల్ని చూడాలని వచ్చింది" అని భార్య అనడంతో, "అలాగా! బాగున్నావా అమ్మా?" అంటూ సంధ్యను పలుకరించాడు అతను ఆప్యాయంగా.

"బాగున్నారా మావయ్యగారూ? " అంటూ పరామర్శించింది సంధ్య.

"ఏం బాగులే తల్లీ! కోడలని కోరి తెచ్చుకుంటే మా పాలిట కొరివై కూర్చుంది. ఆ రోజు మీ నాన్నగారు అడిగినప్పుడే నిన్ను చంద్రానికి చేసుకునుంటే మాకు ఈ పాట్లు తప్పేవేమో!" అన్నాడు కోడలి వంక నిరసనగా చూసి. "తప్పు మావయ్యగారూ! పెద్దవారు, మీరలా మాట్లాడకూడదు" అంది సంధ్య వారిస్తూ.

గౌరి ఆ ఇంటి కోడలయ్యాక మొదటిసారిగా వారిని చూడ్డానికి వచ్చింది సంధ్య. ఆ వాతావరణం ఇబ్బందిగా అనిపించింది ఆమెకు. ఆమె అవస్థను గ్రహించినదానిలా, "రండక్కయ్యా, పైకి వెళ్దాం" అంటూ చనువుగా సంధ్య చేయి పట్టుకుని మేడ మీదకు తీసుకుపోయింది గౌరి. రెఫ్రెష్మెంట్స్ తీసుకుంటూండగా, "సారీ, అక్కా! అత్తయ్య, మావయ్య మిమ్మల్ని ఇబ్బందిపెట్టినట్టున్నారు" అంది నొచ్చుకుంటున్నట్టు. అనిజీగా మందహాసం చేసింది సంధ్య. "ఎంత మంచివాళ్ళైనా అత్తాకోడళ్ళ మధ్య ఆ డిస్టెన్స్ అలాగే ఉండడం సహజం. అందుక్కారణం జెనరేషన్ గ్యాప్ తప్ప మరేం కాదు".

నవ్వింది గౌరి. "లేదండీ. అత్తయ్య మీతో చెప్పిందంతా నిజమే. కావాలనే నేను వాళ్ళకు విధించిన శిక్ష అది" అంది. తెల్లబోయి చూసింది సంధ్య.

"ఔనండీ. మా అమ్మా, నాన్నా మంచి కట్టుబాట్లతో పెంచారు నన్ను. అత్తవారింటికి పంపించేప్పుడు వాళ్ళు నాతో ఏం చెప్పారో తెలుసా? ఇకమీదట నా తల్లిదండ్రులు వీళ్ళేనని. కాని, నా పెళ్ళికి మావాళ్ళను వీళ్ళు పెట్టిన హింస నేనెలా మరచిపోగలనక్కా?" గౌరి గొంతులో జీర. "ఏం జరిగింది?" విస్మయంతో అడిగింది సంధ్య. "పది లక్షల కట్నం అడిగితే ఇవ్వడానికి ఒప్పుకున్నారు మావాళ్ళు. తీరా అందరికీ శుభలేఖలు పంచేసాక, పెళ్ళి వారం రోజులు ఉందనగా...అమ్మాయికి మెల్ల ఉంది. ఇంకో ఐదు లక్షలు ఇస్తే సరిపెట్టుకుంటాం. లేకుంటే పెళ్ళి జరుగదు" అంటూ పట్టు పట్టారు మావగారు. అది తన తలకు మించిన భారమని నాన్న ఎంత మొత్తుకున్నా కనికరించలేదు. అమ్మాయిని ముందుగా చూసుకునే సంబంధం ఖాయం చేసుకున్నారుకదా అంటే, ఆ విషయం మీరు చెప్పలేదు, మేం చూళ్ళేదు అంటూ మొండికేసారు. పీటలవరకు వచ్చిన పెళ్ళి ఆగిపోతే ఎక్కువగా నష్టపోయేది ఆడపిల్లే. గత్యంతరంలేక ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి అదనపు కట్నం ఇచ్చారు నాన్న. పెళ్ళయాక కూడా అదీ ఇదీ అంటూ నానా అవస్థలూ పెట్టారు మావాళ్ళను..." గౌరి వదనం అరుణిమదాల్చింది. ఆశ్చర్యంతో నోరు తెరచుకుని ఆలకించింది సంధ్య.

"అక్కా! నావల్లే కదా మావాళ్ళకు అన్ని బాధలు అనుకుని నేను ఏడ్వని రాత్రులు లేవు. ఆడపిల్లగా ఎందుకు పుట్టానా అని చింతించని క్షణాలు లేవు. ఈ కట్నాల దుర్వ్యవస్థను దూషించని రోజు లేదు...ఈ ఇంటి పేరును భావితరానికి కొనసాగించే సంతానాన్ని కని పెంచడానికి ఈ కుటుంబంలోకి వచ్చాను నేను. ఈ ఇంటి వంశాభివృద్ధికి తోడ్పడడంలో పావుగా వచ్చాను. కని పెంచి, విద్యాబుద్ధులు గరపినవారిని, తోడబుట్టినవారినీ, అందర్నీ వదిలి ఈ కుటుంబం యొక్క కష్టసుఖాలను పంచుకోవడానికి వచ్చాను...కాని, వీళ్ళేం చేసారు? కట్నాలనీ, కానుకలనీ నన్ను, నావాళ్ళనూ వేధించారు. రేపు వీరికి జవసత్త్వాలు ఉడిగాక కంటిపాపలా చూసుకోవలసిన నన్ను...కంటిలో నలుసులా, పరాయిదానిలా చూసారు. ఆడపిల్లను ఇచ్చుకున్న పాపానికి

మావాళ్ళకు నరకం చూపించారు..." ఆవేశంగా చెప్పుకుపోయిందామె. "అదే అక్కా, నాలో ఈ తిరుగుబాటుకు కారణం. పదిహేను లక్షలు పోసి భర్తను కొనుక్కున్నాను నేను. ఈ ఇంటినీ, ఇంట్లోని మనుషుల్నీ కొనుక్కున్నాను. కనుక ఈ ఇంటి పైన అధికారం నాది. వీళ్ళంతా నా చెప్పుచేతల్లో ఉండాలి, అనిపించింది. కక్ష తీర్చుకుంటున్నాను".

జాలిగా చూసింది సంధ్య. "కాని, అది తప్పు కదమ్మా! ఈ ఎడ్వాన్స్డ్ ఏజ్ లో వారిని కష్టపెట్టడం..." అంది. "తప్పని నాకూ తెలుసక్కా! మా అమ్మా, నాన్నా కూడా తిట్టారు నన్ను..."

చంద్రం రావడం చూసి లేచి నిల్చుంది సంధ్య. "కూర్చోండి. ప్లీజ్!" అంటూ లోపలికి వచ్చాడు అతను. కుశలప్రశ్నల అనంతరం, "గౌరీ కళ్యాణం కాస్తా డౌరీ కళ్యాణం అయిందన్నది మా గౌరి ఫిర్యాదు. కన్యకు కాక కట్నానికి తాళి కట్టే పెళ్ళికొడుకులకూ, కట్నం కోసం జలగల్లా పీడించే పెద్దమనుషులకూ తగిన గుణపాఠం చెప్పాలన్నది తన ధ్యేయం. అత్తమామల్ని హరాస్ చేయడంతో తన ఉద్యమం ఆరంభించింది" అన్నాడు నవ్వుతూ.

"మీకంతా వేళాకోళమే! అసలు మీకు బుద్ధు, బెడ్డు రెండూ గడ్డుచేసేస్తే తెలిసొచ్చేది" అంది గౌరి కోపంగా. "అమ్మో! ఆ పని మాత్రం చేయకు" అన్నాడు భయం నటిస్తూ.

సంధ్య నవ్వేసి, "లోకం తీరే అలా ఉన్నప్పుడు మావయ్యగారిని తప్పుపట్టి ఏం లాభం, గౌరీ? పాపం, వయసు మళ్ళిన వాళ్ళను మరీ కష్టపెట్టడం మంచిది కాదేమో! అక్కా అంటూ ఆప్యాయంగా పిలిచావు కాబట్టి నాకు తోచింది చెబుతున్నాను. అపార్థం చేసుకోకు" అంది.

అందుకు చంద్రం కూడా నవ్వేసి, "మీకో విషయం తెలుసా? చెడు చేస్తున్నాననుకుంటూ గౌరి వాళ్ళకు మంచే చేస్తోంది. అమ్మకు, నాన్నకు డయాబెటిక్స్ ఉంది. డాక్టర్ వాళ్ళను ఎక్సర్సైజ్ చేయమన్నాడు. అది వాళ్ళ వల్ల కాదు. వాకింగ్ కూడా అలవాటులేదు. ఇంటి పనైనా చేస్తే మనసుకు, శరీరానికీ కొంతవరకైనా వ్యాయామం లభిస్తుందనిపించింది. నిజానికి తోటపని మొదలుపెట్టాక నాన్నగారి ఆరోగ్యం ఎంతో మెరుగుపడింది. అందుకే గౌరి ఉద్యమానికి నేను సైలెంట్ స్పెక్టేటర్ని అయ్యాను" అన్నాడు.

సంధ్య నవ్వింది. గౌరి కూడా ఆమెతో శృతి కలుపుతూ, " మా అత్తమామలకు పట్టిన గతి ఇతరులకు గుణపాఠం కావాలన్నది ఓ కారణమైతే, వీళ్ళలో పశ్చాత్తాపం తీసుకురావడం నా లక్ష్యం, అక్కా! ఆ మధ్య ఓసారి మావయ్యగారన్నారు, మావాళ్ళ దగ్గర తీసుకున్న అదనపు కట్నం తిరిగి ఇచ్చేస్తానని. ఆ మాటే నేను నాన్నతో అంటే, 'ఆడపిల్లకు అరణంగా ఇచ్చింది తిరిగి

తీసుకుంటామా? తప్పమ్మా!’ అంటూ, అత్తమామలకు      మనస్తాపం కలిగిస్తున్నందుకు తల వాచేలా చివాట్లు పెట్టారు నాకు. అత్తయ్యనీ, మావయ్యనీ నెత్తిమీద పెట్టుకునే రోజులు త్వరలోనే ఉన్నాయి లెండి" అంది.

పల్లెటూరి పిల్లైనా, పెద్దగా చదువుకోకపోయినా కట్నదాహార్తుల పైన కత్తిగట్టిన ఆమె తెగువకు, మనోపరిపక్వతకూ ఆరాధానగా, మురిపెంగా గౌరి వంక చూస్తూ ఉండిపోయింది సంధ్య.




హేమాంగ రాజ్యాన్ని మహీపాలుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన పరిపాలనలో దేశమంతా ఎంతో సుభిక్షంగా వర్ధిల్లుతూ ఉండేది. మహీపాలునికి ఇద్దరు కుమార్తెలు. సౌందర్యరేఖ, మందారమాల. ఇరువురూ అతిలోక సుందరీమణులే. చూడ చక్కని రూపు రేఖలతో పాటు, అపరిమితమైన తెలివి తేటలు, పెద్దల ఎడల వినయ విధేయతలు కలిగి యుండి రాజు గారి మనసు రంజింపజేస్తూ ఉండేవారు.

అమ్మాయిలిద్దరూ యుక్త వయసులోకి అడుగిడగానే, వారికి వివాహం చేయ సంకల్పించి, స్వయంవరానికి ఏర్పాట్లు చేయవలసిందిగా తన సిబ్బందికి ఆదేశించాడు మహీపాలుడు. అన్ని దేశాలకూ వర్తమానాలు వెళ్ళాయి. నగరాన్ని సర్వాంగ

సుందరంగా అలంకరించారు. స్వయంవరం జరిగే నాటికి వివిధ దేశాలకు చెందిన రాజ కుమారులందరూ నగరానికి విచ్చేశారు. అనుకున్న రోజురానే వచ్చింది. సర్వాలంకృతలైన రాజ కుమార్తెలిద్దరూ చేతిలోవర మాలలు పట్టుకుని స్వయంవర మంటపంలోకి అడుగు పెట్టారు.ఒక్కో యువరాజును పరిచయం చేస్తూ వారికి సంబంధించిన విశేషతలను తెలియజేయసాగాడు మహా మంత్రియైన మకరసేనుడు. అపురూప సుందరుడు, సకల శాస్త్రపారంగతుడు, మహావీరుడు అయిన భూపాలపుర యువరాజును వరించి అతడి మెడలో పుష్ప హారాన్ని వేసింది సౌందర్యరేఖ. అందరూ హర్ష ధ్వానాలు చేశారు. రాజుగారు ఆనంద పరవశులైనారు.

మందారమాల మాత్రం సౌందర్యరేఖలా త్వరగా నిర్ణయం తీసుకోలేదు. యువరాజులందరి గురించి తెలుసుకున్నాక వారిలో అర్హులనిపించినవారు ముగ్గురిని ఎంపిక చేసింది. ఆ ముగ్గురిలో నుంచి తనకి అన్నివిధాల నచ్చిన వాడిని ఎన్నుకునేందుకు తండ్రి అనుమతిని కోరింది.

వారు ముగ్గురూ కూడా అగ్ర రాజ్యాధీశుల సుపుత్రులే. అందచందాలలో క్షాత్ర విద్యలలో సరి సమానులే. వారిలో ఒకరిని ఆమె ఏవిధంగా ఎంపిక చేసుకుంటుందో మహీపాలునికి అర్థం కాలేదు. అయినా కూతురి యుక్తి మీద ఆయనకు విశ్వాసముండడం చేత ఆమె కోరిన దానికి సమ్మతించారు.

మందారమాల ఆముగ్గురు యువరాజులను ఉద్దేశించి ఇలా అంది. “ మీ ముగ్గురూ అన్ని విషయాలలోనూ సమ ఉజ్జీలే అన్న సంగతి నాకు బోధపడింది. నేను మీలో ఒకరిని వరించాలంటే నేను అడిగిన ప్రశ్నకి మీరు సూటిగా సమాధానమివ్వాలి.”

ముగ్గురు యువరాజులూ ఏక కంఠంతో “అలాగే రాకుమారీ... మీ ప్రశ్న ఏమిటో సెలవివ్వండి” అన్నారు.

అప్పుడు మందారమాల “ నేనే కనుక ఈ సృష్టిలో కెల్లా అమూల్యమైనదీ, అందమైనదీ అయిన కానుకను నాకిమ్మంటే మీరేమిస్తారు? బాగా ఆలోచించి చెప్పండి. మీ సమాధానాన్ని బట్టి నా నిర్ణయం ఉంటుంది.” అంది.

ముగ్గురు రాజకుమారులూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. వారు ఏమని బదులిస్తారోనని రాజు గారితో పాటు సభా సదులందరూ ఆసక్తిగా ఎదురు చూడసాగారు.

మొదటగా మైధిలి పుర యువరాజైన సమర భూపాలుడు “నేను అతి విలువైన నవరత్న ఖచిత పాద మంజీరాలని మీకు

బహూకరించదలచాను యువరాణీ.     అవి తర తరాలుగా మా ఖజానాలోఉన్నాయి. వాటి విలువ అంచనా వేయడం మాఆర్థిక నిపుణుల వల్ల కూడా కాలేదు. అంతటి అపూర్వమైన మంజీరాలను మీకు కానుకగా ఇవ్వగలను.'' అన్నాడు తాను చెప్పినది విన్న రాకుమారి తననే వరిస్తుందన్న ధీమాతో.

అంగ రాజకుమారుడైన విక్రమ వర్మ " నేను అంత విలువైన కానుకలిచ్చుకోలేనుగాని, మీ రూపాన్ని యధాతధంగా చిత్రించగల నైపుణ్యం నాకుంది. ఇప్పటికిప్పుడు మీ సమక్షంలోనే మీ యొక్క సుందర చిత్రాన్ని గీసి మీకు కానుకగా సమర్పించ గలను.'' అన్నాడు అచంచల విశ్వాసంతో.

ఇక మాళవ దేశ యువరాజైన అమర దీపుడు " వీరిద్దరితో పోలిస్తే నా వద్ద అంత విలువైన వస్తువులు కాని, మదిని మైమరపించే కళా కౌశలంకాని ఏమీ లేవు. అయితే నా వద్ద ఉన్న వస్తువు పూర్తిగా నా స్వంతం. అది నాకు వారసత్వంగా లభించలేదు. నేర్చుకున్నందువల్ల పట్టు బడ్డ విద్యాకాదు. అది దైవదత్తం... అమూల్యం. అత్యంత స్వచ్ఛం. అతి సున్నితం'' అన్నాడు మృదువుగా. మందారమాల తనకనురెప్పలు అల్లాడిస్తూ " అలాగా... అదేమిటో సెలవివ్వండి యువరాజా...'' అంది చిరునవ్వుతో. " అది మరేదో కాదు యువరాణీ...మిమ్మల్ని కల్లా కపటం లేకుండా ప్రేమించ గలిగే నా మనసు. అవును యువరాణీ... మీరు అంగీకరిస్తే పాలకన్నా తెల్లనైన నా మనసుని మీకు కానుకగా అందజేస్తాను.'' చల్లగా నవ్వాడు అమర దీపుడు.

సభలోని వారు నివ్వెరపోయారు. అవకాశం దొరికినప్పుడు రాకుమారికి విలువైన కానుకనివ్వకుండా 'తన మనసు' ఇస్తానంటూ పలికిన అమరదీపుని వెర్రివాడిని చూసినట్లుగా చూశారు. మందారమాలకు భర్త అయ్యే యోగ్యత సమరభూపాలునికి గాని, విక్రమవర్మకు గాని మాత్రమే ఉందనీ కాబట్టి యువరాణి వారిలోఒకరిని వరిస్తుందని తమలోతాము గుసగుసలాడుకున్నారు. ఇక రాజకుమారుల సంగతి చెప్పనే అక్కరలేదు. ఏ ప్రత్యేకత లేని అమర దీపుడిని పక్కనపెట్టి మందారమాల తమ ఇద్దరిలో ఒకరిని వరిస్తుందన్న నమ్మకంతో ఉన్నారు సమరభూపాల, విక్రమవర్మలు.

అమరదీపుడు మాత్రం ఏ అలజడీ లేకుండా ప్రశాంతంగా ఉన్నాడు. చేతిలోవరమాలను ధరించిన     మందారమాల హంస గమనంతో వారి దగ్గరకు వచ్చి అందరూ ఆశ్చర్యపోయే విధంగా అమరదీపుని మెడలో వరమాలను వేసింది.

సభా సదులందరూ నివ్వెరపోయారు. సమర భూపాల విక్రమవర్మలిరువురూ ఉక్రోషంతో ఊగిపోయారు.

" మేమివ్వాలనుకున్న అపురూపమైన కానుకలను కాలదన్ని మీరు ఏ ప్రత్యేకతా లేని అమర దీపుని ఎలా వరించారో తెలుసుకోవచ్చునా యువరాణీ'' అంటూ ఆవేశంగా ప్రశ్నించారు.

“ కోపగించుకోకండి యువరాజులారా... మీరివ్వాలనుకున్న కానుకలు అపురూపమైనవి, ఖరీదైనవే కావచ్చు.కాని, అవి ఏనాటికైనా వన్నె తగ్గిపోవచ్చును. వాటిని చోరులు దోచుకు పోయే అవకాశముంది. కాని, అమరదీపుల వారు నాకర్పించిన మనసు మాత్రం ఎప్పటికీ అలాగే ఉంటుంది. ‘ప్రేమించే మనసుకి’ ఎన్నటికీ నాశనమన్నది లేదు. దాని విలువ అమూల్యం. అది ఎవరిచేతా దోచుకో బడని అపురూపమైన పెన్నిధి. అందుకే నేను వారిని వరించాను.” మృదువుగా పలికింది మందారమాల. సమరభూపాలుడు, విక్రమవర్మ సిగ్గుతో తలదించుకున్నారు ఆమె సమాధానం విన్నాక. అమర దీపుడు ఆరాధనగా చూశాడు మందారమాల వైపు. మహీపాలుని వదనంలో ఆనందం వెల్లి విరిసింది. ఆమె ఎంపిక సరియైనదేనంటూ తమ కరతాళ ధ్వనుల ద్వారా హర్షాన్ని వ్యక్త పరిచారు సభలోని వారు.




“ఈ సమస్య నుంచి సూర్యారావు ఒక్కడే తనను తేలిగ్గా బయట పడేయగలడు. వెంటనే అతన్ని కలవాలి. వివరాలు చెప్పాలి” అనుకున్నాడు దాలయ్య.

ఆ ఊళ్లో క్రిమినల్ లాయర్ గా సూర్యారావుకి మంచి పేరుంది.

“అతను ఎలాంటి క్లిష్టమైన కేసులనయినా   చేపడతాడు. అవతల వాళ్లని తికమక పెట్టి   తిమ్మిని బమ్మిని చేసయినా అవలీలగా చిక్కులు బయట పడేస్తాడు. కేసు చేపట్టాడంటే నిపంట పండినట్టే ” తెలిసిన వాళ్లెవరో దాలయ్యకు సలహా ఇస్తే అతని ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరాడు.

అతను వెళ్లేసరికి   సూర్యారావు   ఎవరితోనో   మాట్లాడుతున్నాడు. వాళ్లను పంపించాక   దాలయ్యను వచ్చిన పని గురించి అడిగాడు. దాలయ్యకి చిన్న షాపు ఉంది. అది పెట్టుకోటానికి ఊర్లో మార్వాడీ   నుంచి అప్పు చేశాడు. అందుకు నెలనెలా వడ్డీ చెల్లిస్తూ వస్తున్నాడు.

ఇప్పుడు   పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యారు. ఖర్చులూ పెరిగాయి.   కొత్త కొత్త షాపింగ్ మాల్స్ రావటంతో షాపులో బేరాలు తగ్గు ముఖం పట్టాయి. వ్యాపారం కష్టమవుతోంది. దాంతో   నెలనెలా   వడ్డీ   చెల్లించటం భారమయింది.

ఇలాంటి పరిస్థితుల్లో తను అప్పు కట్టకపోతే   తీవ్ర పరిణామాలు ఎదురువుతాయంటూ మార్వాడీ చేసిన హెచ్చరికలు తనను కలవరపరుస్తున్న సంగతిని దాలయ్య ఏకరవు పెట్టాడు.

“నేను   తీసుకున్న అప్పు కంటే కట్టిన వడ్డీ చాలా ఎక్కువ. ఇంకా చెల్లించాలంటే నా వల్ల కాదు. తలకు మించిన ఈ భారం మోయలేను.   మార్వాడీ డిక్రీ పొందితే   తను తనఖా పెట్టిన ఇంటిని కూడా స్వాధీనం చేసుకోటానికి చట్టం వెసులు బాటు కల్పిస్తోంది. ” అతని వైపు సానుభూతిగా చూశాడు సూర్యారావు.

“అసలే వ్యాపారం దివాళా తీసిపోయింది.   ఉన్న ఇల్లు కూడా మార్వాడీ పాలయితే, నేనూ, నా   పిల్లలు వీధిన పడతాం. దయచేసి నన్ను ఈ   ప్రమాదం నుంచి బయట పడేయండయ్యా.. లేకపోతే   అంతా కలిసి ఆత్మహత్య చేసుకోవటం తప్ప గత్యంతరం లేదు” కన్నీటి పర్యంతమయ్యాడు దాలయ్య.

సూర్యారావు తీవ్రంగా ఆలోచించాడు. రకరకాల ప్రశ్నలు వేసి సమాచారం తీసుకున్నాడు.   అతని చెప్పిన సమాధానాలన్నీ విని సంతృప్తి చెంది...

“ నీ కేసు నేను తీసుకుంటున్నాను. ఫీజు అవసరంలేదు.. కాకపోతే..   నీ కుడిచేతకున్న కంకణం నాకు బహుమతిగా ఇవ్వాలి”. తన కోరికను బయటపెట్టాడు సూర్యారావు.

తాత ముత్తాల నుంచి తనకు వారసత్వంగా వచ్చిన ఆ కంకణాన్ని వదులుకోటానికి దాలయ్యకు మనస్కరించలేదు. అది తమకు సెంటిమెంట్. మరణించేవరకూ అది తన చేతిలో ఉండవలసింది. అలాంటిదాన్ని తనెలా ఇవ్వగలడు?

సూర్యారావు కోరికను కాదంటే కేసు తీసుకోడు. అప్పుడు మార్వాడీ చేతిలో తను బలికాక తప్పదు. తర్వాత ఏదయిదే అదవుతుంది. ప్రస్తుతానికి తలాడిస్తే పోలా?" అని మనసులో అనుకుని...

' అలాగే... మీరు కోరినట్టే ఈ కంకణం ఇచ్చేస్తా'.. నమ్మకంగా చెప్పాడు.

సూర్యారావు సంతృప్తి చెందాడు.

తనకు కావలసిన అన్ని వివరాలు దాలయ్య నుంచి రాబట్టాడు.

కోర్టులో నడుచుకోటమెలాగో వివరించాడు.

" నువ్వు మార్వాడీ నుంచి అప్పు తీసుకున్నావా?" ప్రశ్నించాడు జడ్జి బోనులో ఉన్న దాలయ్యను ఉద్దేశించి..." ఇచ్చినవాడెవడు? పుచ్చుకున్నవాడెవడు? " సమాధానమిచ్చాడు దాలయ్య.

"నా ప్రశ్న నీకు సరిగా అర్ధం కాలేదనుకుంటా?" మళ్ళీ అడిగాడు.

" నువ్వు ఈ మార్వాడీ దగ్గర అప్పు తీసుకున్నావా? నెలనెలా వడ్డీ కట్టవలసి ఉన్నా... అది కట్టటం లేదని నీ పైన ఫిర్యాదు.. దీనికి నువ్వేమంటావ్?"

దాలయ్య చెప్పాడు.

“ ఇచ్చినవాడెవడు? పుచ్చుకున్నవాడెవడు?”

“ అది కాదు... దాలయ్యా? నేను అడిగిన ప్రశ్న..” జడ్జి అసహనంగా వ్యక్తం చేశాడు.

“ ఇచ్చినవాడెవడు? పుచ్చుకున్నవాడెవడు?” అన్నాడు దాలయ్య.

ఇక చేసేది లేక జడ్జి మౌనం దాలిస్తే.. మార్వాడీ తరపున లాయరు బోను దగ్గరకు వచ్చి..

“దాలయ్యా? నువ్వు అప్పు తీసుకుని నెలనెలా వడ్డీ చెల్లించకుండా.. నా క్లయింట్ ను ఇబ్బంది పెడుతున్నావ్? దీని వల్ల ..” ఇంకా ఏదో చెప్పబోయాడు.

“ ఇచ్చిన వాడెవడు? పుచ్చుకున్నవాడెవడు?” - దాలయ్య.

“నేను తెలుగులోనే అడుగుతున్నా... నేనేదో అడుగుతుంటే.. నువ్వు చెప్పిందే చెబుతావే? విసుగ్గా అన్నాడు మార్వాడీ తరపు లాయర్.అంతలో సూర్యారావు లేచి నిలబడ్డాడు.

“ అయ్యా.. జడ్జిగారూ.. నా క్లయింట్ అమాయకుడు.

గతంలో పొగాకు వ్యాపారం చేసేవాడు. ఓ సారి గోడౌన్ తగలబడిపోయి.. మొత్తం అంతా నాశనమయిపోయింది. దాంతో దివాళా తీశాడు.ఇన్సూరెన్సు కూడా లేకపోవటంతో ఉన్న ఆస్తి మొత్తం హరించుకు పోయింది.

అంతే కాదు. అది మతి చలించింది. అప్పట్నుంచి ఇదే వరస...

ఈ సంగతి తెలిసి మార్వాడీ దురాశతో అతనిపై కేసు పెట్టాడు.

దయచేసి సానుభూతితో పరిశీలించి ఇతనికి కేసు నుంచి విముక్తి ప్రసాదించ వలసిందిగా కోరుతున్నాను'' సూర్యారావు మాటలు జడ్జిని కదిలించాయి.

' అమాయకుడయిన దాలయ్యను కోర్టుకు లాగినందుకు మార్వాడీని మందలించారు. పరిహారంగా కోర్టు ఫీజు చెల్లించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు.

దాలయ్య నిరపరాధిగా బయటపడ్డాడు.సూర్యారావు పెదాలపై చిరునవ్వు తళుక్కుమంది.

కేసు గెలిచిన ప్రతిసారీ అతను అలాగే నవ్వుకుంటాడు.కోర్టు హాలులో నుంచి బయటకొచ్చి ప్రాంగణం బయట దాలయ్య కోసం ఎదురు చూడసాగాడు. దాలయ్య దగ్గరకు రాగానే ''నువ్వు హామీ ఇచ్చినట్టు.. ఆ కంకణాన్ని నాకు ఇచ్చెయ్'' కోరాడు సూర్యారావు.''ఇచ్చేవాడెవడు? పుచ్చుకునేవాడెవడు''- దాలయ్య.'' అయ్.. నేను చెప్పిన మాటలు నాకే అప్పగిస్తావా?' మర్యాదగా ఆ కంకణం తీసి నాకు ఇవ్వు.. ''‘‘ ఇచ్చేవాడెవడు? పుచ్చుకునేవాడెవడు? ''

మళ్లీ చెప్పాడు దాలయ్య.

సూర్యారావు కోపానికి హద్దుల్లేకుండా పోయింది.

'' నేను అడిగింది ఇస్తావా? లేకపోతే నీ ప్రాణాలు తీస్తాను'' పళ్లు పటపట కొరుకుతూ దాలయ్య గొంతు పట్టుకున్నాడు.'' ఇచ్చేవాడెవడు? పుచ్చుకునేవాడెవడు?'' అన్నాడు దాలయ్య తాపీగా. మెల్లగా జనం మూగుతున్నారు. సూర్యారావుకి భయం వేసింది. తనున్న పరిస్థితుల్లో నలుగురి కంటా పడితే పరువు తక్కువ. వృత్తి పరమైన కళంకం. కోపాన్ని నిగ్రహించుకుని బతిమాలటం మొదలుపెట్టాడు.ఏ ప్రయోగానికి దాలయ్య దిగిరాలేదు. మొదటిసారి సూర్యారావుకు ఎదురుదెబ్బతగిలింది. అమాయకుడనుకున్న దాలయ్య ఏకు మేకయ్యాడు.చివరికి ' ఇచ్చేవాడెవడు? పుచ్చుకునేవాడెవడు?' అనుకుంటూ దాలయ్య కళ్ల ముందు నుంచి కదిలి వెళ్లిపోతున్నా...ఏం చేయలేక .. నిస్సహాయంగా చూస్తుండిపోయాడు

ది గ్రేట్ క్రిమినల్ లాయర్ సూర్యారావు...




సత్య

రాత్రి వేళ .... ఇంట్లో నేనొక్క దాన్నే ఉన్నా. కిటికీ లోనుంచి తెరలు తెరలుగా గాలి వీస్తోంది. ఆ గాలి లోనుంచి ఎవరిదో విషాదగానం వినిపిస్తోంది. నా పరిస్థితికి తగినట్టే ఉంది ఆ పాట కూడా. సాయంకాలం జరిగిన సంఘటనే పదేపదే గుర్తుకొస్తోంది. భయమేస్తుంది. బాధ కలుగుతోంది.

తండ్రిలా కాపాడాల్సిన వాడే కాటేయడానికి పూనుకున్నాడంటే అంత కంటే ఘోరం ఏముంటుంది. కాలేజికి శెలవు కావడం తో ఇంట్లోనే ఉన్నాను . ఉదయాన్నే అమ్మ తమ్ముడు పెళ్ళికని పక్క ఊరు వెళ్లారు.

తలనొప్పిగా ఉంటే కళ్ళు మూసుకుని పడుకున్నా. నిద్ర పట్టేసింది. అంతలోనే ఎవరో బుగ్గపై ముద్దు

పెట్టుకున్నట్టు,గుండెలపై చేయి వేసి తడుము తున్నట్టు అనిపించి గబాలున కళ్ళు తెరిచా.

ఎదురుగా వికృతంగా నవ్వుతూ అతను. పిచ్చ కోపమొచ్చి బలంగా ఒక్క తోపు తోసా. అంతే...అతను వెళ్లి బల్లిలా గోడకు కరుచుకున్నాడు. క్షణంలో జరిగి పోయింది ఆ సంఘటన. లేకుంటే ఇంకేమి జరిగేదో? విసురుగా లేచి హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చున్నా.

అతగాడు ఏమి మాట్లాడకుండా బయటి కెళ్ళి పోయాడు. తలుపు గడియ పెట్టి వచ్చా.అతగాడు మళ్ళీ వస్తే ఏం చేస్తానో ఏమో ?జరిగిన ఘటన పదేపదే కళ్ళముందు కదులుతోంది.

ఒక్కసారిగా ఎందుకో ఏడుపు తన్నుకొచ్చింది. కాసేపు ఏడిచాను. నాన్న పోయిన తర్వాత తమకు అండగా తనకు తోడుగా ఉంటాడని భావించి అమ్మ అతగాడిని జీవితంలోకి ఆహ్వానించింది. కానీ అందుకు

బిన్నంగా జరుగుతోంది. మారు తండ్రిగా కూతురి అచ్చటముచ్చట తీర్చాల్సిన అతను ఇలా మృగం లా మారతాడని ఊహించలేదు. ఆ సంఘటన మానసికంగా నాకు ఓ పెద్ద షాక్ .

ఇవన్నీ అమ్మకు ఎలా చెప్పాలి? ఏ మని చెప్పాలి ?నీ మొగుడు నా మీద కన్నేశాడని తల్లితో కూతురు ఎలా చెప్పగలదు?దేవుడా.. ఎవరికి ఇలాంటి పరిస్తితి ఎదురు కాకూడదు.

మొదట్లో అతను బాగానే ఉండేవాడు. ఇటీవలే వికారపు చేష్టలు మొదలు అయ్యాయి . అమ్మ ఇంట్లో లేని సమయంలో అతని ప్రవర్తనలో ఏదో తేడా ఉంటుంది. ఎందుకైనా మంచిదని దూరంగానే ఉంటున్నాను.

స్నానం చేసాక బెడ్ రూం లో కొచ్చి బట్టలు మార్చుకోవడం అలవాటు. అదే సమయంలో ఏదో సాకుతో లోపల కి రావడం. తలుపు చాటు నుంచి తొంగి చూడటం. వెకిలి గా నవ్వడం.బెడ్ రూం లోకి పిలవడం ... కూర్చో అనడం.

ఇవన్నీ అతని పట్ల అసహ్యాన్ని, అనుమానాన్నిపెంచాయి. నాకేసి కేసి అదోలా చూస్తుంటాడు ... ఆ చూపుల్లో ఏదో తేడా. అతను అలా చూస్తుంటే ఒళ్ళంతా తేళ్ళు ,జెర్రులు పాకిన ఫీలింగ్.

తండ్రి లాంటి వాడు కూతురి గుండెలకేసి చూస్తే ఆ ఆడపిల్లకు ఎంత ఇబ్బంది ? అవసరం లేకపోయినా పనికట్టుకుని భుజాలపై చేతులు వేయడం,వీపు నిమరడం,హత్తుకునే ప్రయత్నాలు చేయడం నాకెందుకో నచ్చలేదు. ఆ స్పర్శలో పిల్లల పట్ల ఉండాల్సిన ప్రేమ కనిపించడం లేదు. అమ్మ మొగుడని అన్నిభరించాను. ఇంత వయసొచ్చి ఇదేం బుద్ధి ? ఇవన్నీ అమ్మ కెలా చెప్పాలి?చెబితే ఏమనుకుంటుందో? అమ్మ కూడా అంత సంతోషంగా ఉన్నట్టు కనిపించడం లేదు. అతగాడు ఈ మధ్య రోజూ అమ్మతో గొడవ పడుతున్నాడు. కారణం ఏంటో అర్ధం కావడం లేదు. ఇరువురి వైఖరి బట్టి చూస్తుంటే వారి మధ్య అంత సఖ్యత ఉన్నట్టులేదు. అమ్మ కూడా తప్పు చేసిందేమో అనిపిస్తోంది. ఇలాంటి పరిస్తితుల్లో ఈ విషయాలన్నీ ఎవరికి చెప్పుకోవాలి.

అతగాడితో ఎప్పటికైనా ప్రమాదమే. అమ్మకు చెబితే ఏమంటుందో ?ఇద్దరూ గొడవ పడితే? ఆ పర్యవసానాలు ఎలా ఉంటాయో?ఏది ఏమైనా అమ్మకు చెప్పడమే మంచిదేమో. లేదంటే ఇక ఒకటే మార్గం. అనుకుంటూ యాధృచ్చికంగా కిటికీ వైపు చూసాను.

అక్కడ ఎవరో నిలబడినట్టు నీడ... అది నన్నే చూస్తున్నట్టుగా అనిపించింది.

నా చూపు అటు పడగానే క్షణంలో అది మాయమైంది.

.....................................................................................

సరోజ

సత్య చెప్పిన విషయం వినగానే కాళ్ళ క్రింద భూమి కంపించినట్టు అయింది. ఒక్కసారిగా బీపీపెరిగింది. శేషు ఇంత దుర్మార్గంగా ప్రవర్తిస్తాడా? కూతురు మీద కాముకత చూపుతాడా?ఛీ.. ఛీ .. వీడు మనిషి కాదు పశువు. కొద్ది రోజులుగా సత్య లో ఏదో తేడా కనబడుతోంది.మనిషి ఎందుకో డల్ గా ఉంటోంది.

అప్పటికి ఒకసారి రెండు సార్లు అడిగేను "ఏమి లేదు అమ్మా" అంటూ విషయం దాటేసింది.

తను ఎవరినైనా ప్రేమిస్తుందా ?లేక ఎవరైనా వెంట పడి వేధిస్తున్నారా ? టీనేజ్లో ఇలాంటివి సహజంగా జరుగుతుంటాయి. మొదటినుంచి పిల్లలను ఒక పద్ధతి ప్రకారం పెంచాను .

సత్య పెద్దది ఇంజనీరింగ్లో చేరింది ఈ మధ్యనే.అబ్బాయి టెన్త్ చదువుతున్నాడు.

ఆయన అయిదేళ్ళ క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు.

అంతకుముందే శేషు పరిచయం అయ్యాడు భర్త స్నేహితుడిగా. విశాల్ చనిపోయినపుడు శేషు దగ్గరుండి అన్ని చూసాడు. కొంత కాలం జరిగేక అతనే పెళ్లి విషయం ప్రతిపాదించాడు. ఎంతో ఆలోచించిన తర్వాత ఒకే అన్నాను.

సింపుల్ గా గుళ్ళో దండల పెళ్ళిచేసుకున్నాం. పెళ్లి చేసుకోవడమే నేను చేసిన తప్పేమో. అతని గురించి ఏమి వాకబు చేయలేదు.తను పెళ్లి జరిగినట్టు రిజిస్టర్ చేయించమని గొడవ.

ఎందుకో నాకు అలా చేయాలనిపించలేదు.దాటేసాను. మొదట్లో బాగానే ఉండే వాడు. పిల్లలను చక్కగా చూసుకునే వాడు.కానీ రాను రాను అతన్ని భరించడం కష్టమై పోతోంది. ఏడాది కూడా కాక ముందే అతగాడి ప్రవర్తన పట్ల విసుగొచ్చేసింది. చిన్న విషయాలకు అబద్ధాలు చెప్పేవాడు. మనిషికి బద్ధకం ఎక్కువ. ఆ కారణం గానే ఉద్యోగం పోయింది.మరో ఉద్యోగం చూసుకోవచ్చు. కానీ ఆ ప్రయత్నమే చేయడం లేదు. నేను చేస్తోన్న ప్రైవేటు జాబు తోనే ఇల్లు గడవడం కష్టంగా ఉంటోంది.

అదే విషయం అడిగేను. సమాధానం లేదు. ఆ మధ్య లక్షరూపాయలు కావాలన్నాడు. లేవని చెప్పాను. అప్పటినుంచి మనిషిలో మార్పు మొదలైంది. పైగా తరచుగా తాగి వస్తున్నాడు. రాత్రిళ్ళు నరకం చూపేవాడు.ఒకరోజు అతనికి సహకరించలేదని చేయి చేసుకున్నాడు.నేను కూడా ఎదురు తిరిగి చెంప పగల గొట్టాను. అ రోజునుంచి దూరంగా దూరంగా ఉంటున్నాడు. ఇన్ని జరుగుతున్నా పిల్లలకు తెలికుండా జాగ్రత్త పడ్డాను. ఈ గొడవల్లో వాళ్ళు నలిగి పోకూడదని.

ఈ మధ్య అతని మొదటి భార్య గురించి విషయాలు తెలిసాయి. శేషు మొదటి భార్య "రాజీ" కిరోసిన్ పోసుకోని ఆత్మహత్య చేసుకుందని ఒకరు.,ఇతనే చంపాడని మరొకరు చెప్పారు.కోర్టులో కేసు కూడా నడుస్తోందట. ఆ విషయాలన్నీ రహస్యంగా ఉంచాడు. ఒక రోజు ఆ విషయం ప్రస్తావిస్తే 'నువ్వు అడగలేదు..నే చెప్పలేదు' అన్నాడు. ఎందుకో అతని వ్యవహార శైలి నచ్చడం లేదు. అతనితో కలసి ఉండాలని అనిపించడం లేదు. ఇంతలో ఈ సంఘటన. ఇవాళ అటో ఇటో తేల్చి పారేయాలి. ఇంకా

తాత్సారం చేస్తే పిల్ల పై ఏ అఘాయిత్యమైనా జరగొచ్చు. ఎలాగైనా ఈ దరిద్రాన్ని వదిలించుకోవడమే మంచిదేమో.
..........................................................................................

శేషు

ఏంటో టైం బాగాలేదు.అన్నీ అవమానాలే. జీవితంలో ఇలాంటి అవమానం ఎపుడూ ఎదురు కాలేదు. ఏదో చిన్న తప్పు చేసానని ఇంట్లో నుంచి వెళ్ళిపో అంటుందా సరోజ. అసలు దాంతో ఉండటమే పెద్ద తప్పు. ఎన్నెన్ని మాటలు అన్నది. దాంతో ఒక సుఖమూ లేదు ...సరదా లేదు. ఛా దీనెమ్మ జీవితం.

పాత ఇంటికి వచ్చి కూర్చున్నా. సాయంత్రం నుంచి ఒకటే తాగుడు. విస్కీ నరనరాలలోకి ఎక్కిందేమో రక్తం కుత కుత లాడులోంది. సరోజ మాటలే చెవిలో జోరీగ ల్లా రొదపెడుతున్నాయి. అది ఒట్టి జడ పదార్ధం.ఉప్పు కారం తినే వాడిని ఎంత కాలం సర్దుకుపోగలను. అదే మాట సరోజతో అంటే తిట్టి పోసింది.

తిక్క రేగి చేయి చేసుకుంటే ...తిరగబడి కొట్టింది. లం .....ఎంత పొగరు ? ఆ విశాల్ గాడు ఎలా కాపురం చేసాడో ఏమో. ఈ సరోజ కంటే "రాజీ" యే నయం. చెప్పు కింద తేలులా పడి ఉండేది. తన చెల్లెలుతో సంబంధం పెట్టుకున్నానని తెలిసినానోరు మెదప లేదు.

తన టైం బాగా లేక మాడి మసి అయిపోయింది. పాపం పిచ్చిది . సరిగ్గా ఈరోజుకి ఏడాది అవులోంది. నేను తాగితే మనిషి ని కాను అని తెలిసి ఆ రోజు గొడవకి దిగింది. అంతకు ముందు రోజే పుట్టింటికి వెళ్ళివచ్చింది. వాళ్ళ అన్నే దాన్ని రెచ్చగొట్టి పంపాడు. ఆ రోజు డబ్బు అవసరమై చేతికున్న గాజులు ఇవ్వమని అడిగేను.

"చచ్చినా ఇవ్వను"అంది.

ఎపుడూ ఎదురు తిరగని మనిషి ఎదురు తిరిగేసరికి తిక్క లేచింది. వెంటనే వెళ్లి కిరోసిన్ డబ్బా తెచ్చి రాజీ పై కుమ్మరించాను.

"అయితే చావు" అంటూ అగ్గిపుల్ల గీసి పడేశా కసిగా. చచ్చి ఊరుకుంది. అదిక్కడే దెయ్యమై తిరుగులోందని వాళ్ళూ

వీళ్ళూ అంటున్నారు. ఇక్కడ అద్దెకి ఉన్న వాళ్ళు కూడా ఆ భయం తోనే ఇల్లు ఖాళీ చేసిపోయారు. మనకైతే కన్పించిన దాఖలాలు లేవు. అయినా నేనే పెద్ద దెయ్యాన్ని.

నా జోలికెవరొస్తారు ?

ఈ విషయం ఎలా తెలిసిందో ఏమో సరోజ ఒకరోజు అడిగింది.  ఏదో చెప్పి తప్పించుకున్నాను కాని అప్పటినుంచి సరోజలో మార్పు వచ్చింది. దగ్గరకు రానివ్వడం లేదు. బయట వాళ్ళతో ఇకిలించుకుంటూ మాట్లాడుతుంది. నన్ను చూడగానే రుసరుస లాడుతుంది. పెళ్లి రిజిస్టర్ చేద్దామంటే వద్దంటుంది. నామీద ఏదో అనుమానం ఉన్నట్టుంది. పొరపాటో గ్రహపాటో  ఉన్న ఉద్యోగం ఊడింది. కొత్తది చూసుకోవాలి కదా. ఉద్యోగాలు అంత తొందరగా దొరుకుతాయా?

ఏదైనా వ్యాపారం చేస్తాను..లక్ష రూపాయలు ఇవ్వమంటే "పైసా కూడా" ఇవ్వనంది.

ఎంత కొవ్వు?

ఇక తల్లికి మించింది కూతురు.  దాని షోకులు అది ... పెద్ద ఖతర్నాక్. వయసుకి మించిన మాటలు చెబుతుంది. దానికి ఇంత చిన్న వయసు లోనే ఇద్దరు బాయ్ ఫ్రెండ్స్ అట. ఇక పెద్ద అయితే ఎంత మందో ? ఏదో అందంగా ఉందని.....తన వంక చూస్తే.... అదొక తప్పా? నా మీద ఫిర్యాదు చేస్తుందా తల్లికి. పిల్ల ఏపుగా పెరిగింది. ముద్దోచ్చింది కదా అని ముద్దు పెట్టు కున్నాను.దానికే అంత రెచ్చి పోవాలా? దానికేమైనా నేను కన్న తండ్రినా? అదేదో మహాపరాధం లా నన్ను పట్టుకునినిలదీస్తుందా సరోజ. ఇంటి నుంచి వెళ్లిపో అంటుందా? సైతాన్. దాని  సంగతి అటో ఇటో తేల్చి పారేయాలి. లేపేస్తే ఒక పని అయిపోతుంది . కనీసం ఇన్సురెన్స్ అయినా  వస్తుంది.

నాలో ఆవేశం పెరిగి పోతోంది.ఏదో చేయాలన్న కసి పుట్టుకొస్తోంది. పెగ్గు మీద పెగ్గు పోసుకుని  గడ గడ తాగేసెను.అప్పటికే ఫుల్ బాటిల్ ఖాళీ చేసేసాను.మరొకటి ఓపెన్ చేశాను. కళ్ళు మూతలు పడుతున్నాయి . శరీరం మత్తులో జోగుతోంది.  ప్రతీకారపు తాలుకు ఆలోచనలు ఒక పట్టానా తెగడం లేదు.  ఇంతలో ఎవరో తలుపు కొట్టిన శబ్దం.

"ఎవరు "అరిచాను ... జవాబు లేదు. నిమిషం తర్వాత మళ్ళీ అదే పనిగా తలుపు కొడుతున్న శబ్దం.

"తలుపు తీసే వుంది.... రండి " మళ్ళీ అరిచి చెప్పేను. మళ్ళీ టక్ టక్ శబ్దం ..... తిక్క లేచి "ఎవడ్రా అది " అంటూ విసురుగా లేవ బోయాను.

సరిగ్గా అదేసమయంలో ఎవరో వెనుకనుంచి తోసినట్టు అనిపించింది. శరీరం అదుపు తప్పి బొక్క బోర్లా పడ్డాను.తోసింది దెయ్యం కాదు కదా? అనుకునే లోగానే.

ఎవరో నామీద స్పిరిట్ లాంటి ద్రవం ఏదో పోశారు.అగ్గిపుల్ల గీసి పడేసారు.    ఒక్కసారిగా నా శరీరంపై భగ్గుమంటూ    మంటలు లేచాయి. క్షణాల్లో అంతా జరిగిపోయింది. లీలగా తెలుస్తూనే ఉంది. కాని అరిచే ఓపిక లేదు .కళ్ళుతెరుచుకోవడం లేదు. అంతే.... ఆపై ఏమి జరిగిందో ?????????????????




" మీ నాన్నగారి పద్ధతి ఏమి బాగాలేదండీ!"

'ఏమయింది"

"ఏముంది! ఆయన చాదస్తం ఆయనది. పిల్లల్ని కంట్రోల్ చేయాలని చూస్తారు. పిల్లలేమో ఈ చాదస్తం ఏమిటో...ఇంట్లో మాకు స్వేచ్ఛ లేకుండాపోయిందని వాపోతున్నారు. ఫ్రీ గా ఉండలేకపోతున్నామని బాధ పడుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.""ఇంతకూ ఏమయిందే?"

"ఏముంది! వాళ్ళ స్వంత విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడట. అలా ఉండాలి. ఇలా ఉండాలని ఆంక్షలు విధిస్తున్నాడట. వాళ్ళు ఇబ్బంది పడ్తున్నారు."

"ఆయన చెప్పినట్లు వింటే పోలా? వాళ్ళ మంచికేగా ఆయనేమైనా చెప్పేది?''

"మొన్నటికి మొన్న ట్యాప్ లీకయి నీళ్ళు కారుతుంటే పెద్ద రాద్ధాంతమే చేశాడు. మేమేదో నీళ్ళు వృధా చేస్తున్నట్లు పెద్ద క్లాసే పీకాడు. నీళ్ళు, కరెంట్ పొదుపు చేయాలట. జాగ్రత్తగా వాడుకోవాలట. లేకుంటే భావి తరాల వారు ఇబ్బంది పడతారట."

"మంచిదే కదా?"

"పిల్లల్ని ఉదయం ఐదింటికే లేపి యోగా, వాకింగ్ చేయమంటాడు. ల్యాప్ టాప్స్, చాటింగ్స్ ఆపేసి రాత్రుల్లో త్వరగా పడుకొని నిద్రపోవాలట. ఆఖరికి తిండి విషయంలో కూడా..."

"ఆ! కూడా...!

"బయటి తిండ్లు మాని ఇంట్లో వేళకు తినమని; టైమింగ్స్ మైంటైన్ చేయమని ఒకటే గోల. ఆరోగ్యమే మహా భాగ్యమట. ఐనా ఈ కాలం పిల్లలకు మనం చెప్పాలా? అంటే వినడు. అంతా తనకే తెలిసినట్లు; అందరూ తన మాటే వినాలన్నట్లు మొండి వైఖరి. ఈమధ్య అదేదో...""..... "

"ఆ !స్వచ్ఛ భారత్ అట. పెద్ద పెద్ద వారే చీపురు పట్టుకుని రోడ్లు ఊడుస్తున్నారట. కనీసం ఇంటిని శుభ్రంగా ఉంచమని మీ మీ రూంలను మీరే శుభ్రంగా ఉంచుకోమని ఒకటే నస. రోజుకు ఏదో ఒక నస. పిల్లలు చాలా ఫీల్ అవుతున్నారండీ!

"మా మంచి మాకు తెలియదా? ఆయన చెప్పాలా? అంటున్నారు. చివరికి మేము ఏ డ్రెస్ వేసుకోవాలో; ఎలా ఉండాలో ఆయనే నిర్ణయించేస్తాడు. ఆయన వచ్చినప్పటినుంచి నరకం అనుభవిస్తున్నామని తెగ ఫీల్ అయిపోతున్నారు. మీరే ఏదైనా ఆలోచించండి." "ఏం ఆలోచించమంటావు?"

"ఆయన్ను... ఏదైనా వృద్ధాశ్రమం లో....."

"పార్వతీ! ఏమంటున్నావు. మతి ఉండే మాట్లాడుతున్నావా?"

"అదికాదండీ! ఆయనికేం లోటు రానివ్వకుండా చూసుకుందాం."

చలపతి కోపం ఒక్కసారిగా నషాలానికెక్కింది. పార్వతి ఇలా ఆలోచిస్తుందని అనుకోలేదు. అసలు తమ మధ్య ఇలాంటి చర్చ వస్తుందని వూహించనేలేదు. అలాంటి ఊహే చలపతికి భరింపరానిదిగా ఉంది. పరిస్థితిని జీర్ణించుకోలేకపోతున్నాడు. హాల్లో పేపర్ చూస్తున్న శంకర్రావు కు ఇదంతా వినిపిస్తూనే ఉంది. అసలు వినిపించాలనేమో కోడలు కొంత పెద్ద గొంతు తోనే చెప్పుకుపోతుంది. ఇంతకీ తను చేసినతప్పేంటీ? పరిపరి విధాలుగా ఆలోచించసాగాడు.

శంకర్రావు అరవై ఐదేళ్ళ రిటైర్డ్ ప్రొఫెసర్. చాలా డిసిప్లైండ్ లైఫ్. ఏదైనా పద్ధతి ప్రకారం చేయాలనుకుంటాడు. ఉద్యోగం నిష్ఠగా చేశాడు. పిల్లలకు పాఠాలతో పాటు క్రమశిక్షణ నేర్పాడు. అతని దగ్గర చదువుకున్నవారంతా చాలా పై స్థాయిలో ఉన్నారు. ఉద్యోగపరంగా చాలా మంచి పేరు సంపాదించుకున్నారు. సలహాలు, సంప్రదింపులకు ఆయన దగ్గరికి చాలా మంది వచ్చేవారు. అవి చాలా మంది జీవితాల్ని మార్చేశాయి. కొన్ని జీవితాల్ని నిలబెట్టాయి. తన జీవితమంతా పదిమందికి చెప్పే స్టేజ్ లో గడిపాడు. అంతేగానీ, ఒకరి దగ్గరి చెప్పించుకోలేదు.

కాని ఇంట్లోనే --

రిటైర్ ఐనతర్వాత కూడా అలాగే ఉండాలని భావిస్తాడు. తన పిల్లలు; వారి పిల్లలు తనలాగే దర్జాగా బతకాలంటాడు. మొన్నటికి మొన్న -

ట్యాప్ లో నీళ్ళు రాత్రి నుంచి బొట్లు బొట్లుగా కారుతుంటే - "అమ్మాయ్! ఆ ట్యాప్ కు ఏదైనా చేయరాదా?" అన్నాడు.అంతెత్తున లేచింది కోడలు.

"చెప్పి పంపినా ప్లంబర్ ఇంకా రాలేదు తాతా! అయినా బొట్టు బొట్టుగానే గా కారుతుంటా! వాడొస్తే రిపేర్ చేస్తాడులే! మీరు కంగారు పడకండి!" మనవడి నిర్లక్ష్యం.

"బొట్టు బొట్టు కలిస్తేనే సముద్రం. బొట్టే కదా అంటే ఒక రోజుకు ఎంత వేస్ట్ అవుతుందో తెలుసా?"

"అబ్బ తాతయ్యా? ఏంటి ఇంత చిన్న విషయానికి అంత రాద్ధాంతం? అయినా అవంతా మాకు తెలియదనుకుంటావా?" కంఠంలో విసుగు.చేసేదేమీ లేక తనే బజారుకెళ్ళి కొత్త ట్యాప్ తెచ్చి బిగించాడు. అదే కాదు . పని ఉన్నా లేక పోయినా - అన్ని లైట్ లు వెలుగుతుంటాయి. అన్ని ఫ్యాన్ లు తిరుగుతుంటాయి. అవసరం లేని చోట ఆపి కరెంట్ పొదుపు చేయమంటాడు.

"అవి మాకు తెలియవా?" అంటారు వాళ్ళు.

కారులో షికారు కెళ్ళి ఏ అర్ధరాత్రి దాటాకో వస్తాడు మనవడు. అంతవరకు తిరుగుళ్ళేమిటి?" అంటాడాయన. ఆ బలాదూర్ తిరుగుళ్ళు మాని పెట్రోల్/డీసెల్ అదా చేయమంటాడు ప్రొఫెసర్. ఇంధనం ఆదా చేస్తే దేశానికి విదేశీ మారక విలువలు పెరుగుతాయంటాడాయన."అవి మాకు తెలియవా?" అంటాడు మనవడు.

"అర్ధ రాత్రి దాక చాటింగ్ లేమిటి?" అంటాడాయన.

ల్యాప్ ట్యాప్ వాడకం తగ్గించమంటాడు.కళ్ళకు దెబ్బ; నిద్రకు భంగం అంటాడు.

"అవి మాకు తెలియవా?" అంటుంది మనవరాలు.

ఆ తిరుగుళ్ళు; ఈ చాటింగ్ లు మాని టయానికి నిద్ర పొమ్మంటాడు. ఉదయమే లేచి వాకింగ్, యోగా చేయమంటాడు.

"అన్నీ మాకు తెలుసు."అంటారు పిల్లలు.

సాయంత్రం ఐదు గంటలు.

బీచ్ లో బల్లపై కూర్చుని దీర్ఘాలోచనలో ఉన్నాడు శంకర్రావు.

ఎంతకాదన్నా ఉదయం జరిగిన సంఘటనలే కళ్ళ ముందు కదలాడుతున్నాయి. కొడుకు అటు ఇటు నలిగిపోతున్నట్లుంది. వాడినిబ్బంది పెట్టడం తనకిష్టం లేదు.

ఇదిగో ... ఇక్కడే బల్లపైన కూర్చుని ఎదురుగా అలల వైపు చూస్తూ ఎన్నో సాయంత్రాలు గడిపాడు. మనసు కు ఏదైనా బాధ ఏర్పడినప్పుడు ఒంటరిగా ఇక్కడే సేద తీరాడు. ఉపశమనం పొందాడు. అలలు, వాటి శబ్దాలూ అస్తమిస్తున్న ఎర్రటి సూర్య బింబం తనకెంతో ఆనందానిస్తాయి. ఎన్నో వెన్నెల రాత్రుల్లో కూడా అక్కడే సేద తీరాడు. ఎన్నో సంవత్సరాలుగా తన బాధలను, సంతోషాలను వాటితోనే పంచుకున్నాడు. బాల్యంలో ఈ అలలతోనే ఆడుకున్నాడు. తీరం వెంబడే వాకింగ్ చేశాడు. ఈ బల్లపైన్నే చదువుకున్నాడు. ఇక్కడే కదూ! శ్యామల కూడా పరిచయమయింది. అవును. చల్లని సాయంత్రం వేళల్లో ఒకరి కళ్ళల్లో ఒకరు చూసుకుంటూ ...సమయమే తెలిసేది కాదు. వెన్నెల రాత్రుల్లో ; ఇసుక తిన్నెలపై పడుకుని ఆకాశాన్ని చూస్తూ; చుక్కల్ని లెక్కిస్తూ ...కాలమే తెలిసేది కాదు. ఒకరి చేతులొకరు పట్టుకుని తీరం వెంబడి నడుస్తుంటే; అలలు కాళ్ళను తాకి వెనక్కు వెల్తుంటే శ్యామల కళ్ళల్లోని మెరుపు చూసి తీరాల్సిందే.

'పల్లీలు, ఐస్ క్రీంలు, బెలూన్లు అమ్ముకునేవారి కేకలతో బీచ్ అంతా కోలాహలంగా ఉంది. అందమైన జంటలతో, పిల్లల కేరింతలతో అంతా సందడి సందడిగా ఉంది. ఎవరి లోకంలో వారు...ఎవరి ఆనందంలో వారు.

ఒకరి భుజం పై ఒకరు చేయి వేసి అలవోకగా నడుచుకుంటూ వచ్చి, ఓ ప్రేమికుల జంట అల్లంత దూరంలో ఇసుకలో

కూర్చున్నారు. కబుర్లే కబుర్లు. కలలే కలలు. జీవితంలో ఏదో సాధించేయాలని ...అలా బతకాలని..ఇలా బతికేయాలని ఎన్నెన్ని కలలో ఆ యవ్వనం ముంగిట్లో - ఎదురు బెంచిపై ఉన్న జంట ఒక్కసారిగా ఎందుకో గట్టిగా నవ్వారు. ఐస్ క్రీములు తింటూ పిల్లలు తల్లితండ్రులతో హుషారుగా కబుర్లు చెప్తున్నారు. వాళ్ళ కళ్ళల్లోని మెరుపు ... పెద్దల ఆనందం -ఎంత తియ్యటి అనుభూతి --ఇదే ఆనందం ఇదే మెరుపు పాతికేళ్ళ తరువాత ఉంటాయా? ఉండవని ఇప్పుడే తెలిస్తే ఈ ఆనందం ఉంటుందా?

శంకర్రావు తనలో తాను నవ్వుకున్నాడు. ముప్పై ఐదేళ్ళ క్రితం తను అలాగే ఉన్నాడు. తన ఫామిలీ - తను, శ్యామల, చలపతి. ఇదే లోకం. వాళ్ళ ఆనందమే తన ఆనందం. వాళ్ళు ఆనందంగా ఉంటే చాలు ...అదే తనకు ఆనందం. కానీ, ఇప్పుడేమయింది? శ్యామల పదేళ్ళ క్రితం తనను ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయింది. అప్పుడే తను సగం చచ్చిపోయాడు. ఉద్యోగ నిర్వహణలో నిమగ్నమై కొంత మర్చిపోగలిగాడు కాని ...ఇప్పుడు మళ్ళీ ఆమె జ్ఞాపకాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

రిటైర్మెంట్ తర్వాత చలపతి తన దగ్గరికే వచ్చేయమని పట్టుబట్టాడు. రాక తప్పలేదు. చలపతి మంచి వాడే. కోడలూ మంచిదే. పిల్లలూ మంచివారే. ఎటుతిరిగి...ఈ తరాల అంతరమే ప్రతిబంధక మయిందేమో? తరాల మధ్య విలువలే సమస్య లయిందేమో? తను కొన్ని విలువలతో బతికినవాడు. పిల్లలకు క్రమశిక్షణ నేర్పినవాడు. నీతులు చెప్పడమే కాదు ఆచరించి చూపినవాడు. కానీ, ఇప్పటి పిల్లలు తెలివైన వారే కాదు అన్నీ తెలిసిన వారు. వారికి ఇంతక్రితం లా ప్రొఫెసర్లపై అధారపడాల్సిన అవసరం లేదు. వారికి భయపడాల్సిన అవసరము అంతకంటే లేదు. నెట్ ద్వారా ఏ జ్ఞానాన్నైనా క్షణాల్లో డౌన్ లోడ్ చేసుకునే కెపాసిటీ ఉన్నవారు. అందుకే ఈ తరం వారికి అన్నీ తెలుసు. అవును అన్నీ తెలుసు. తెలియకపోయినా క్షణాల్లో తెలుసుకునే వెసులుబాటు ఉంది. వారికి తెలియందంటూ ఏమీ లేదు.

ఈ తరానికి అన్నీ తెలుసు. అందరూ మేధావులే. అందరూ చెప్పే వారే. కాని వినే వారే కరువయ్యారు. ఆచరణలో పెట్టేవారు తగ్గుతున్నారు. అందుకే విలువలు దిగజారుతున్నాయి. మేధావులు నోరు విప్పడానికి భయపడ్తున్నారు. తమ అవసరం వచ్చే తరానికి అక్కర్లేద నుకుంటున్నారు.

శంకర్రావు ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. ఇక తనెవరికీ భారం కదల్చుకోలేదు.

రాత్రి చాలా పొద్దుపోయినట్లుంది. బీచ్ అంతా నిర్మానుష్యంగా ఉంది.

భార్యకు తన అవసరం తీరింది. కొడుకుకూ తీరింది. కోడలికి తన అవసరం లేదు. మనవడికి, మనవరాలికి కూడా తన

అవసరం లేదు.   అదిగో తన అవసరం సముద్రుడికుంది. చేతులు సాచి రమ్మంటుంది. అలల రూపంలో ఆహ్వానం ... అవును .

రావు లేచి నిలబడ్డాడు. చుట్టుప్రక్కల కలయ చూశాడు. కనుచూపు మేరలో ఎవరూ లేదు. నిర్ణయం మరింత గట్టిపడింది. అంతే. అడుగులు ముందుకు పడ్డాయి. ముందుకు... మరింత ముందుకు ...మరో ఆలోచన లేదు. నీళ్ళు చల్లగా పాదాలకు తగిలాయి. ముందుకు ... మరింత ముందుకు; నడుం దాకా నీళ్ళు ...ముందుకు ...మరింత ముందుకు

"మాస్టారూ!" ఎవరివో కేకలు తను వినదల్చుకోలేదు. ముందుకు ...మరింత ముందుకు   అలలు బలంగా ఉన్నాయి. నీళ్ళల్లో కాళ్ళు తేలిపోతున్నాయి.

"మాస్టారూ! మాస్టారూ!"

ఎదురుగా పెద్ద అల... గట్టిగా కళ్ళు మూసుకున్నాడు మాస్టారు.   భుజంపై   ఎవరిదో చేయి బలంగా
సూర్యోదయమయింది.   సముద్రం ఒడ్డున ఉన్న బెస్తపాలెం జనాభా మొత్తం రెండు వందల మంది దాకా అక్కడ గుమికూడి టెన్షన్ లో ఎదురు చూస్తున్నారు.   అదో ఆశ్రమం. వాతవరణమంతా ప్రశాంతంగా ఉంది.   అల్లంత దూరంలో సముద్రం కూడా చాలా ప్రశాంతంగా ఉంది. సముద్రం పైన్నుంచి వీస్తున్న చల్లని గాలి అక్కడున్న వారికి కొంత ఊరట కలిగిస్తోంది.

శంకర్రావు   మాస్టారు మెల్లగా కళ్ళు తెరిచారు. ఆశ్చర్యంతో లేవబోయారు.

"మెల్లగా మాస్టారూ!" అంటూ చెంగి మెల్లగా లేపి కూర్చోబెట్టింది.

మాస్టారు ఏదో చెప్పబోయాడు. వద్దని వారించింది చెంగి.

"మాస్టారూ! పదేళ్ళ క్రితం నన్ను మీరు కాపాడారు. ధైర్యం నూరిపోశారు. బతుకు పైన ఆశ నింపారు. భవిష్యత్ పై   భరోసా ఇచ్చారు. ఆ గుండె ధైర్యంతోనే నేను క్రొత్త బ్రతుకు మొదలెట్టాను. మీ స్ఫూర్తితోనే బ్రతుకుతున్నాను. పదిమందికోసం బ్రతుకుతున్నాను. ఈ రోజు ఈ పాలేనికి సర్పంచ్ ని."

సర్పంచ్ గా ఈ వూరికి రోడ్ లు వేయించాను. గుడి కట్టించాను. బడి పెట్టించాను. మీ స్ఫూర్తితో ఈ ఆశ్రమాన్ని నా ఖర్చుతో కట్టించాను. మీరెందుకు ఈ పని చేశారని అడగను. కాని, మీ అవసరం మా పాలేనికుంది. మీరిక్కడే ఆశ్రమంలో ఉంటూ మమ్మల్ని నడిపించండి. మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో మాకు ముందుండి దారి చూపండి." ఆగింది చెంగి.

"చెంగి జిందాబాద్ ... సర్పంచ్ జిందాబాద్...మాస్టార్ జిందాబాద్." జనంలో హుషారు పెరిగింది. ముక్త కంఠంతో ఆమోదం. చెంగి మాటంటే జనంలో వేద వాక్కే. ముగ్ధుడయ్యాడు మాస్టారు.

"మాస్టార్...ఇక్కడే ఉండాలి"

"మాస్టార్...ఇక్కడే ఉండాలి"

జన నినాదం తనను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఏ చదువూ లేని ఒక అమాయక పిల్ల ... ఆత్మహత్య చేసుకోబోతుంటే వారించి నాలుగు మంచి మాటలు చెప్పినందుకే ఇంతగా పాలేం జనాల్లో ఎదిగిపోయి వారి అభివృద్ధికి అంకితమయిందంటే ఆశ్చర్యమేసింది. తన అనాలోచిత నిర్ణయానికి ఒకింత సిగ్గేసింది కూడా."యస్. తన అవసరం వీళ్ళకుంది. " అనుకున్నాడు శంకరం మాస్టారు .




ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. యడతెరిపిలేకుండ వర్షం కురుస్తునే ఉంది. ఊరికి దూరంగాఉన్న ఒక పెంకుటిల్లు ఒంటరిగా అన్ని కోల్పోయినట్టు నిస్తేజంగా ఉంది. చాల పాతకాలం నాటి ఇల్లు కావటంతో గోడలు పెచ్చులు ఊడిపోయాయి. పైగా గదిగోడలు నల్లగా మసకబారినట్టు తారురంగులో ఉన్నాయి. ఇదిచాలదన్నట్టు పైకప్పు మీద నుంచి బూజులు వేలాడుతున్నాయి. గది గుమ్మం దగ్గర నిలిబడి ఆశగా రోడ్డు వైపు చూస్తుంది రత్తాలు. దాదాపు రెండు రోజులనుంచి ఆమె అలాగే చూస్తోంది. కనీసం ఈ రోజు అయిన ఒక్క ప్యాసింజర్ అయినరాకపోతాడా అని ఆమె ఆశ.

దూరంగా ఉన్న మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. దాదాపురెండు రోజుల నుంచి ఆగకుండ వర్షం కురుస్తునే ఉంది. ముందు చిన్న చినుకులతో మొదలయిన వర్షం గంట గడిచేసరికి కుంబవృష్టిగా మారిపోయింది. ఈదురుగాలలతో పిడుగుల చప్పుడుతో వాతావరణం భీభీత్సంగా మారిపోయింది. ఒక గంటలో తగ్గిపోతుందని అనుకున్న వర్షం విడవకుండ కురువటంతో రత్తాలు బెంబెలు ఎత్తిపోయింది. తన దగ్గరు అంతవరకు దాచుకున్న డబ్బుతో ఇంటికి వెచ్చాలు బాబుకు పాలు కొనుక్కుంది. దాంతో ఆమె దగ్గర ఒక పైసా కూడా మిగలలేదు. అయిన రత్తాలు కంగారుపడలేదు. కనీసం ఒక ప్యాసింజర్ అయిన రాకపోతాడా అనుకుని మనస్సుని సరిపెట్టుకుంది. కాని ఆమె ఆశ నిరాశ అయింది. వర్షం తగ్గలేదు సరికదా ఇంకా ఎక్కువైంది. రెండు రోజులపాటు ఆగకుండ కురుస్తునే ఉంది.

నగరంలో జనజీవితం పూర్తిగా స్తంబించిపోయింది. మిగత జనం మాట అటుపక్కన పెడితే ఈ వర్షం వల్ల రత్తాలు మాత్రం చాల నష్టపోయింది. చేతిలో డబ్బు లేదు. ఇంట్లో వెచ్చాలు నిండుకున్నాయి. బాబు పాల కోసం ఏడ్చి ఇప్పుడే నిద్రపోయాడు. ఈ రోజు కూడా ప్యాసింజర్ రాకపోతే తన పరిస్థితి ఏమిటా అని మదనపడింది రత్తాలు. ముందు పక్కన ఉన్న వాళ్ళ సహాయం అడగాలని అనుకుంది. కాని వాళ్ళ పరిస్థితి కూడాఇంచుమించు అమె లాగే ఉంది.

నిజానికి ఒక సంవత్సరం ముందు రత్తాలు జీవితం చాల ఆనందంగా సాఫీగా సాగిపోయింది. భర్త యాదగిరి ఒక పెద్ద కంట్రాక్టర్ దగ్గర పనిచేస్తేవాడు. రోజుకు అయిదువందలు సంపాదించి తెచ్చేవాడు. అతనికి ఒక్క చిన్న చెడ్డఅలవాటు కూడా లేదు. కనీసం టీ కూడా బయటతాగడు. పెద్దగా చదువుకోలేదు అతను. కనీసం తనకు పుట్టబోయే బాబు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని అతని కోరిక. అందుకే పెళ్ళయిన మొదటి రోజు భార్య రత్తాలును దగ్గర కూర్చోపెట్టుకుని తన మనస్సులో మాట చెప్పాడు.

"చూడా రత్తాలు నువ్వు నేను ఏం చదువుకోలేదు. కాని మనకు పుట్టబోయే బాబు బాగా చదువుకోవాలి. బాగా చదువుకుని పెద్ద కొలువు చెయ్యాలి. అందరు వాడిని చూసి ముక్కునవేలువేసుకోవాలి. కాని ఇది మనం అనుకున్నంత తేలికకాదు. ఖర్చుతో కూడుకున్నది. నేను రోజు అయిదువందలు సంపాదిస్తాను. అందులో రెండు వందలు తీసి దాచిపెట్టు. మిగత మూడు వందలతో మనం సరిపెట్టుకుందాం. ఎంత కష్టం వచ్చిన దాచుకున్న డబ్బులోంచి ఒక్క పైసా కూడా తియ్యటానికి వీలులేదు. వాడికి నాలుగు సంవత్సరాలు వచ్చేసరికి స్కూలులో చేర్పించటానికి మన దగ్గర చాల డబ్బు ఉంటుంది. ఎవరిని చెయ్యి చాచి అడగవలసిన అవసరం లేదు. ఏమంటావ్"అన్నాడు.

సరే అంది రత్తాలు. మరునాడు నుంచి భర్త ఇచ్చిన డబ్బులోంచి రెండువందలు వేరే డబ్బాలో దాచిపెట్టటం మొదలుపెట్టింది. సరిగ్గా సంవత్సరం తరువాత రత్తాలుకు మగబిడ్డపుట్టాడు. వాడిని చూసి ఇద్దరు ఎంతో మురిసిపోయారు. దొరబాబులా ఉన్నాడని చుట్టుపక్కల వాళ్ళు అనేవాళ్ళు. ఆ మాటలు విని ఇద్దరు ఎంతో ఆనందపడిపోయారు. కొడుకును చూసుకుని ఆ భార్య భర్తలు తమ కష్టాలను మరిచిపోయేవారు.

సరిగ్గా బాబు పుట్టిన నాలుగునెలలకు వాళ్ళ జీవితంలో తుఫాను చెలరేగింది. ఆ రోజు మాములుగా యాదగిరి పనికి వెళ్ళాడు. సాయంత్రం పనిముగించుకుని మార్కెట్టుకు వెళ్ళాడు. భార్యకు పూలు కొన్ని కూరగాయలు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మాములుగా రోజు అతను మెయిన్ రోడ్డు క్రాస్ చేసి తన ఇంటికి చేరుకోవాలి. ఆ రోజు కూడా అతను జాగ్రత్తగా మెయిన్ రోడ్డు క్రాస్ చెయ్యబోయాడు. అప్పుడే ఒక లారి వేగంగా వచ్చి అతన్ని బలంగా గుద్దుకుంది. యాదగిరి అక్కడికి అక్కడే చనిపోయాడు. అతనిచేతిలో ఉన్న పూలు పండ్లు రోడ్డు మీద పడిపోయాయి. ఈ దారుణం తెలియని రత్తాలు రోజులాగే చక్కగా ముస్తాబు చేసుకుని భర్త కోసం ఎదురుచూస్తోంది. భర్త రాలేదు కాని భర్త దగ్గర పనిచేసే కుర్రాడు వచ్చి చావు కబురుచెప్పాడు. రత్తాలు వెంటనే బాబును చంకనఎత్తుకుని యాక్సిడెంట్ జరిగిన స్థలం దగ్గరికి వెళ్ళింది. అప్పటికే జనం మూగిపోయారు. ట్రాఫిక్ స్తంబించిపోయింది. రత్తాలు ఎలాగో జనం మధ్యలోంచి వెళ్ళి చూసింది. రక్తపు మడుగులో నిర్జీవంగా ఉన్న భర్తను చూడగానే ఆమె స్తంబించిపోయింది. షాక్ తో బొమ్మలా ఉండిపోయింది.

మరుసటి రోజు ఏడుస్తున్న రత్తాలును చూడటానికి కాంట్రాక్టర్ వచ్చాడు. యాదగిరి చాల మంచివాడని నిజాయితిపరుడని పొగిడాడు. అలాంటి వాడు ఇలా అర్ధాంతరంగా వెళ్ళిపోవటం చాల దురదృష్టమని విచారం వెలిబుచ్చాడు. అతను చేసిన సేవలకు

తగిన ప్రతిఫలం ఇస్తానని హామీ ఇచ్చాడు. రత్తాలు ఎంతో సంతోషపడింది. తన కష్టాలు కొంచంవరకు తీరిపోతాయని ఎంతో ఆశపడింది. రోజులు గడుస్తున్నాయి కాని కాంట్రాక్టర్ దగ్గర్నుంచి ఒక రుపాయి కూడా రాలేదు. కష్టాలమీద కష్టాలు రత్తాలును చుట్టుముట్టాయి. ఎంతో కష్టపడి దాచుకున్న డబ్బు యాదగిరి అంతిమసంస్కారానికి ఖర్చయిపోయింది. తినటానికి తిండి లేని పరిస్థితి ఏర్పడింది.

ఏంచెయ్యాలో అనిఆలోచిస్తుంటే ఆమెకు కాట్రంక్టర్ గుర్తుకువచ్చాడు. అతని దగ్గరికి వెళ్ళి డబ్బు సహాయం చెయ్యమని అడిగింది. అప్పుడే కాంట్రాక్టర్ తన కూతురును చూడటానికి విదేశాలకు వెళుతున్నాడు. ఇప్పుడు తన దగ్గర అంత డబ్బులేదని విదేశాలనుంచి వచ్చిన తరువాత ఇస్తానని చెప్పాడు. నిరాశతో ఇంటి ముఖం పట్టింది రత్తాలు.

నెలరోజులు గడిచాయి కాని కాంట్రాక్టర్ మాత్రం తిరిగిరాలేదు. రత్తాలు పరిస్థితి చాల హీనస్థితికి చేరుకుంది.తినటానికి తిండిలేదు. కనీసం బాబుకు పాలు పట్టటానికి కూడా చేతిలో చిల్లిగవ్వలేదు. తను పస్తులు పడుకోగలదు కాని బాబు పాలు లేకుండ బతకలేడు.అందుకే తనకు తెలిసిన చంద్రి ఇంటికి వెళ్ళింది. తనకు ఏదైన సహాయం చెయ్యమని అడిగింది.

నిజానికి చంద్రిది కూడారత్తాలు లాంటి పరిస్థితే. కాని ఆమె ఆ పరిస్థితులు అదిగమించటానికి తన శరీరాన్ని ఆయుధంగావాడుకుంది. పగలు రెండుఇళ్ళలో పాచిపనిచేసేది. రాత్రివేళ రోడ్డు మీద నిలబడి వచ్చే పోయే మగవాళ్ళను ఆకర్షించేది. వాళ్ళకు సుఖం ఇచ్చి డబ్బు తీసుకునేది. ఈ విషయం రత్తాలుకు తెలియదు. తెలిస్తే ఆమె సహాయం అడిగేది కాదు.

“నీకు ఇవ్వటానికి నా దగ్గర డబ్బులేదు. కాని డబ్బుసంపాదించే మార్గం మాత్రం చెప్తాను”అంది చంద్రి.

“ఏమిటది”ఆశగా అడిగింది రత్తాలు.

“నాకు తెలిసిన మూడు ఇళ్ళలో పనిచెయ్యటానికి ఒక మంచి పనిమనిషి కావాలి. ఈ విషయంవాళ్ళు ఈ రోజే చెప్పారు. నీకు ఇష్టమైతే ఆ మూడు ఇళ్ళు నీకిప్పిస్తాను”అంది చంద్రి. సరే అనక తప్పలేదు రత్తాలుకు. మరునాటి నుంచి ఆ మూడు ఇళ్ళలో పనికి కుదిరింది. వాళ్ళు ఒక్కొక్కరు నెలకు పదిహేను వందలు ఇచ్చేవారు. వచ్చే నాలుగువేల అయిదువందలలతో గుట్టుగా సంసారాన్ని నెట్టుకోచ్చింది. అంత కష్టంలో కూడా ఆమె భర్త ఆశయం మరచిపోలేదు. అతను లేకపోతే ఏం. అతని ఆశయాన్ని తాను నెరవేర్చాలని తీర్మానించుకుంది. అందుకే సంపాదిస్తున్న దాంట్లో కొంత భాగం దాచకోవటం మొదలుపెట్టింది.

రోజులు ఆనందంగా గడుస్తున్నాయి. కాని ఆ ఆనందం ఎక్కువరోజులు ఉండలేదు.మళ్ళీ రత్తాలు కష్టాల కడలిలో చిక్కుకుపోయింది. ఆమె పనిచేస్తున్న మూడు ఇళ్ళలో వాళ్ళకు వేరే ఊరుబదిలి అయింది. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగస్థులు కావటంవల్ల ఒకేసారి ముగ్గురికి ట్రాన్స్ ఫర్ అయింది. చేతికి అందిన ముద్ద ఎవరో లాక్కున్నట్టుగా విలవిలలాడిపోయింది రత్తాలు. రేపటినుంచి ఏం చెయ్యాలో తోచలేదు. భవిష్యత్తు అయోమయంగా అంధకారంగా తోచింది.

చేసేది లేక ఒక రోజు బాబును చంకనెత్తుకుని కూలి పనికి పోయింది. మేస్త్రీ ఆమెను రోజు కూలికి తీసుకున్నాడు. దొరికిందే చాలనుకుని ఆ పనిలో చేరిపోయింది. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం వరకు గొడ్డులా పనిచేయించుకునేవాడు మేస్త్రీ. రెండు వందలు చేతిలో పెట్టేవాడు. ఆ డబ్బు తీసుకుని ఆదరబాదరగా ఇంటికి చేరుకునేది రత్తాలు. బాబుకు పాలుపట్టించి తను ఇంత ఉడకేసుకుని తినేది. పదిహేనురోజులు గడిచాయి. ఒక రోజు పని ఎక్కువగా ఉండి సైట్ దగ్గర ఉండిపోవలసివచ్చింది. అప్పటికే మిగత పనివాళ్ళు వెళ్ళిపోయారు. చుట్టు చీకటి ఆవరించుకుంటోంది. బాబు పాలకోసం ఏడుస్తున్నాడు. పని ముగించుకుని బాబుకు పాలు పట్టింది. వాడిని నిద్రపుచ్చి భుజం మీద వేసుకుని మేస్త్రీ దగ్గరికి వెళ్ళింది.

లోపల మేస్త్రీ ఒక్కడే ఉన్నాడు. ఏవో లెక్కలు చూసుకుంటున్నాడు. పోతపోసిన విగ్రహంలా అందంగా ఉన్నా రత్తాలు ఎదురుగా కనిపించేసరికి అతని ఊపిరి ఆగిపోయింది.  నిజానికి రోజు అతను రత్తాలును చూస్తునే ఉన్నాడు. మొదటి సారి ఆమెను చూసినప్పుడు అతనికి గుండెఆగిపోయినంత పనిఅయింది. అతని దగ్గర ఎంతో మంది ఆడవాళ్ళు పనచేస్తున్నారు. కాని ఎవరు రత్తాలు ఆకర్షించినంతగా ఆకర్షించలేదు. పైగా అతను వద్దనుకున్నా వాళ్ళే వచ్చి అతని మీద పడేవాళ్ళు. అతనికి సుఖం ఇచ్చి తమకు కావల్సింది తీసుకునేవాళ్ళు. కాని రత్తాలు మాత్రం అలాంటి పిచ్చివేషాలు వేసేదికాదు. చాల గౌరవంగా టైంకు సైట్ కు వచ్చేది. నడుం వంచకుండ చెప్పిన పనిచేసేది. చిన్న మాట కూడా పడే అవకాశం ఇచ్చేది కాదు.

ముందు తనే ప్రొసిడ్ అయి రత్తాలును లొంగతీసుకోవాలని అనుకున్నాడు మేస్త్రీ.  కాని సీరియస్ గా ఉన్న రత్తాలు మొహం చూసిన తరువాత అతనికి ధైర్యం చాలలేదు.  గొడవచేస్తుందని భయపడిఊరుకున్నాడు. కాని మనస్సులో మాత్రం రత్తాలు మీద కోరిక చావలేదు. అది లావాలా అప్పుడప్పుడు పొంగుతునే ఉంది. కాని సమయం కోసం ఎదురుచూస్తున్నాడుఅంతే. ఆ సమయం ఆ రోజు రానే వచ్చింది.రత్తాలుకు ఓవర్ టైమ్ ఇస్తానని చెప్పి అమెను ఒప్పించాడు.  పనివాళ్ళందరు వెళ్ళిపోయిన తరువాత మెల్లగా రత్తాలును సమీపించాడు.

అంతవరకు మేస్త్రీ ఉద్దేశం ఆమెకు తెలియదు. కాని ఎప్పుడైతే మేస్త్రీ దగ్గరికి వచ్చాడో అతని కోరిక అర్ధమైంది. అతని పట్టులొంచితప్పించుకోవాలని ఎంతో ప్రయత్నించింది. కాని ఆ మొరటు వాడి బలం ముందు ఆమె శక్తి చాలలేదు.  అక్కడే మట్టిలోనే తన కోరిక తీర్చుకున్నాడు మేస్త్రీ. ఆమెకు రావలసిన ఓవర్ టైమ్ తో పాటు తన కోరిక తీర్చినందుకు మరికొంత డబ్బు ఆమె చేతిలో పెట్టాడు.

రత్తాలు జీవచ్ఛంలా లేచి నిల్చుంది. బాబును తీసుకుని ఇంటికి చేరుకుంది. ఇంత కాలం పవిత్రంగా కాపాడుకున్న శీలం మంట కలసిపోయినందుకు విలవిలలాడిపోయింది. భర్తయాదగిరి ఫోటో ముందు నిల్చుని గట్టిగా ఏడ్చింది.

రోజులు గడుస్తున్నాయి. రత్తాలు జీవితంలో ఎలాంటి మార్పులేదు. అక్కడఇక్కడపనిచేస్తూ జీవితాన్ని నెట్టుకోస్తుంది. ఒక రోజు కాంట్రాక్టర్ మనిషి వచ్చి అయ్యాగారుఇంటికి రమ్మంటున్నాడని చెప్పాడు. బహుశా యాదగిరి చావుకు నష్టపరిహారం ఇస్తాడని ఆశపడిఆ మనిషితో అతని ఇంటికి వెళ్ళింది. లంకంత కాంట్రాక్టర్ ఇల్లు చూసిరత్తాలు ఆశ్చర్యపోయింది. కాంట్రాక్టర్ మనిషి ఆమెను లోపలికి తీసుకువెళ్ళి ఒక గది చూపించాడు. గదిలో అమ్మగారు అయ్యాగారుఉన్నారు వెళ్ళు"అన్నాడు.

రత్తాలు బాబును ఎత్తుకుని లోపలికి వెళ్ళింది. ఆమె వెళ్ళగానే బయట నుంచి ఎవరో తలుపుకు గడియపెట్టేశారు. గదిలో మంచంమీద విలాసంగా కూర్చుని ఉన్నాడు కాంట్రాక్టర్. చేతిలో మందు గ్లాసు ఉంది. పక్కన సీసా ఏవో తినుబండారాలు ఉన్నాయి.

"రా రత్తాలు నీ కోసమే ఎదురుచూస్తున్నాను"అన్నాడు.

"రెండురోజులనుంచి సరిఅయిన భోజనం లేదు అయ్యాగారు. మీరు డబ్బు ఇస్తే ఇంటికి వెళ్ళి ఒండుకుని తింటాను. బాబు కూడా ఆకలితో అలమటించిపోతున్నాడు"అంది రత్తాలు.

"నా పని పూర్తికాకుండ డబ్బు ఎలా ఇస్తాను. ముందు నా కోరిక తీర్చుకోనివ్వు"అంటు గ్లాసుపక్కన పెట్టిఆమాంతం రత్తాలు మీద పడ్డాడు కాంట్రాక్టర్. ఆమెచేతిలో ఉన్న బాబును నేలమీద పడుకోపెట్టాడు. బలంగా రత్తాలును తన కేసి లాక్కున్నాడు. ఊహించని ఈ పరిణామానికి రత్తాలు బెంబెలుఎత్తిపోయింది. నిర్ఘాంతపోయింది. షాక్ తో అచేతనురాలైంది. ఆ అవకాశాన్ని కాంట్రాక్టర్ చక్కగా ఉపయోగించుకున్నాడు. ఆమెతేరుకునేలోగా మంచం మీద ఉంది. కాంట్రాక్టర్ ఆవేశంతో ఆమెను ఆక్రమించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని పట్టులోంచి తప్పించుకోవటానికిఎంతో ప్రయత్నించింది రత్తాలు. కానిఅతని పశు బలం ముందు ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. సభ్య సమాజం సిగ్గుపడేలా ఒక అమాయకురాలు ఆనాలుగుగోడల మధ్య తన మానం పోగోట్టుకుంది.

జింక మాంసం తిన్న పులిలా తృప్తిగా లేచాడు కాంట్రాక్టర్. కొంత డబ్బు తీసి ఆమె కేసి విసిరికొట్టాడు.

"ఇలాగే నేను పిలిచినప్పుడల్లా వస్తూఉండు. నీకు కావల్సిన డబ్బుఇస్తాను. నీ దరిద్రం తీరిపోతుంది. నా కోరిక తీరుతుంది"అన్నాడు. ఆడపులిలా లేచి నిలబడింది రత్తాలు . బట్టలు సవరించుకుని అతని మీద కాండ్రించి

ఉమ్మింది. బాబును తీసుకుని గదిలోంచి బయటపడింది.     అంతటితో కాంట్రాక్టర్ ఆమెను విడిచిపెట్టలేదు. లొంగతీసుకోవాలని ప్రయత్నించాడు.కాని రత్తాలు మాత్రం ఒప్పుకోలేదు. ఆ రోజురాత్రి బాబు నిద్రపోయిన తరువాత భర్త ఫోటో ముందు నిల్చుంది. ఇంత జరిగిన యాదగిరి ఆశయం ఆమె మరచిపోలేదు. ఆరునూరైన బాబును బాగాచదివించాలని నిర్ణయించుకుంది.

ఎలాగు రెండు సార్లు శీలం కోల్పోయింది. ఇక పోగోట్టుకోవలసిందిఏం లేదు. ఆ కాంట్రాక్టర్ కు ఉంపుడు కత్తెగా ఉండటం కంటే స్వతంత్రంగా జీవించాలని నిర్ణయించుకుంది. అది శరీరం అమ్ముకునే వృత్తి అయిన పర్వాలేదని అనుకుంది. ఆ రోజునుంచి రత్తాలు పడుపువృత్తిలో దిగింది. రోజు ఇద్దరు ముగ్గురికి సుఖాన్ని ఇచ్చేది. రాబడి పెద్దగా ఎక్కువలేకపోయిన తిండికి బట్టకు లోటులేకుండ జరిగిపోతుంది. కాని రెండు రోజులు యడతెరిపిలేకుండ వర్షం కురవటం వల్ల ఆమె ఆదాయానికి గండి పడింది. నిన్నటి నుంచి ఆమె ఏం తినలేదు. బాబుకు పాలు కూడా పట్టలేదు. పాలకోసంబాగా ఏడ్చి బాబు నీరసంతో అలాగే నిద్రపోయాడు.

“వస్తావా”అంటు ఒక మగవాడి గొంతు వినిపించింది.

రత్తాలు ఆలోచననుంచి తేరుకుని అతన్ని లోపలికి రమ్మనిసైగ చేసింది. అతను సైకిల్ బయట పెట్టి రత్తాలుతో లోపలికి వెళ్ళాడు. ఒక పక్కగా మంచంమీద బాబు నిద్రపోతున్నాడు. ఒకవేళ మేలుకుని ఉన్నా ఈ దారుణం చూడలేక కళ్ళుమూసుకునేవాడు. పదినిమిషాలు ఆ గదిలో గాలి స్తంబించిపోయింది. పెళ్ళి భోజనం చేసినట్టుతృప్తిగాలేచాడు ఆ మగవాడు. వందరుపాయలు ఆమె చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.     రత్తాలు డబ్బుతీసుకుని శెట్టి కొట్టుకు వెళ్ళింది.

“ఒక పాలపాకెట్టు రెండు రొట్టెలు ఇవ్వు”అంటు వందరుపాయలు శెట్టి చేతిలో పెట్టింది. అతను దాని వైపు చూసి “ఇది చెల్లదమ్మా. జాలినోటు”అన్నాడు.

అప్పుడే రేడియోలోంచి “దోపిడి దోపిడి మనిషి మనిషి దోపిడి అంటు పాత సినిమా పాట వస్తోంది.




మధ్య తరగతి ఉద్యోగి ఆనందరావు కి ఏదో ఒక సైడు బిజినెస్ లాంటిది చేసి రిటైర్ అయ్యే సమయానికి నాలుగు రాళ్ళు ఎక్కువ మిగుల్చుకోవాలని తపన.

రియల్ ఎస్టేట్లు,చిట్టీలలో కి దిగుదామంటే భయం, హఠాత్తుగా పెట్టిన డబ్బులన్నీ పోతే అని..పెళ్ళయ్యి పుష్కరం దాటినా ఓ చంద్ర హారం చేయించుకోలేకపోయాను అని ఆనందరావు అర్ధాంగి రమణి పెట్టే నస తగ్గించటానికయినా ఏదో ఒకటి చెయ్యాల్సిందే అని తీర్మానించేసుకున్నాడు..కానీ ఏదీ దారి కనబడటం లేదు.

సాయంత్రాలు ట్యూషన్లూ అవీ చెప్పేవాడు ఇదివరకు.. కానీ "టెక్నో", "కాన్సెప్ట్", వంకాయ టెంకాయ లాంటి స్కూళ్ళొచ్చేసి రేడియోలో పొలం పనుల కార్యక్రమమం

మొదలవ్వక ముందు వెళ్ళిన పిల్లలు రాత్రి యే పదింటికో కానీ ఇల్లు చేరట్లేదు. దాంతో ట్యూషన్ల ఆదాయం కూడా ఏమీ పెద్దగా రావట్లేదు.ఇంత అనుభవం ఉంది కదా తనే ఒక చిన్న స్కూల్ ఎందుకు పెట్టకూడదు అన్న ఆలోచన వచ్చింది ఒకరోజు.

అమ్మో ఆ హంగూ ఆర్భాటం,పేద్ద బిల్డింగ్లు.లక్షల్లో పెట్టుబడి వద్దు బాబోయ్ అనుకున్నాడు.వాళ్ళింట్లో పని చేసే నరసమ్మ పిల్లల ఫీజులకని ప్రతీ మూడు నెల్లకోసారి అడ్వాన్సులు తీసుకుంటుండడం గమనించి మన ఆనందరావు బుర్రలో మెరుపు లాంటి ఆలోచన వెలిగింది..

అంతే..ఆ పక్క వీధిలో ఎప్పటి నుండో ఖాళీ గా ఉన్న చిన్న ఇల్లొకటి అద్దెకి తీసుకుని "బాలానందం" పేరుతో మొదట రెండో తరగతి వరకూ మొదలెట్టాడు.

రమణి ఏకైక టీచర్ మరియు ఆయా ఆ స్కూల్లో. ఫీజులూ అవీ నామ మాత్రం గా ఉండటంతో నరసమ్మ లాంటి వాళ్ళ పిల్లలు కోకొల్లలు గా వచ్చేస్తారు కాబట్టి ఇంకో ఆరు నెల్లల్లో ఇంకో ఆయా ని టీచర్ ని తీసుకుని రమణి కి ప్రిన్సిపాల్ ప్రమోషన్ కూడా వాగ్దానం చేసేసాడు.

నరసమ్మ ఏడేళ్ళ కొడుకు ఓ సారి తన దగ్గరకి వచ్చి సైన్సు ప్రాజెక్టు లో సహాయం అడగటం గుర్తొచ్చి ప్రాజెక్టులు,ట్రిప్ ల పేరుతో డబ్బులు గుంజడాలు లాంటి హంగూ ఆర్భాటాలకి దూరం అని ఇంకా తన స్కూల్ లో పిల్లలకి హోంవర్కులు అవీ ఇచ్చి తల్లి తండ్రులని ఇబ్బంది పెట్టమనీ,రోజూ చెట్ల కింద ఆడుకుంటారనీ.. ఇలా తనకనిపించిన ప్రత్యేకతలన్నీ ఏకరువు పెడుతూ కంప్యూటర్ లో తనకున్న పరిజ్ఞానం తో ఒక పాంప్లెట్ లాంటిది తయారు చేసి ఓ వంద ఖర్చు పెట్టి కలర్ జిరాక్సులు తీయించి నరసమ్మ కి ఓ పాతిక ఇచ్చి పంపించాడు వాళ్ళ బస్తీ లో పంచి పెట్టమని..

వారం గడిచింది. రోజూ రమణి పొద్దున్నే ఇంటి వంట పనులు చేసి స్కూలుకెళ్ళి కూర్చోవడం..ఏవో ఒకటి రెండు ఎంక్వైరీలు వచ్చాయి తప్ప ఒక్క అడ్మిషనూ రాలేదు.

ఇక లాభం లేదని తనే చిన్న పిల్లలున్న ఇళ్ళకి వెళ్ళి వాళ్ళ స్కూల్ గురించి చెప్పేది.. శని ఆదివారాల్లో ఆనందరావు కూడ పార్కుల్లో అక్కడా ఇలాంటి పబ్లిసిటీ చేసేవాడు..ఓ నెల గడిచేసరికి తాముంటున్న ఇంటి అద్దె కాక మరొక అద్దె అదనం గా చెల్లించాల్సొచ్చింది తప్ప పైసా ఆదాయం కనపడలేదు.

అయినా పట్టు వదలని విక్రమార్కుడి లాగ ప్రయత్నిచాడు ఆనందరావు.. ఓ పక్షం రోజులకి పక్కనే ఉన్న బస్తీ లోంచి ఓ ఇద్దరు పిల్లలు జాయిన్ అయ్యారు.ఇంకో వారానికి ఆ వీధి లోకి కొత్తగా వచ్చిన సాఫ్ట్ వేర్ ఇంజనీరు తమ మూడేళ్ళ కవల పిల్లలకి అడ్మిషన్ తీసుకున్నాడు.

ఇదే కదా శుభ దినం అని రమణీ ఆనందరావులు పాడుకున్నారు..స్కూల్లో ఆయా కూడా తనే అవ్వటం తో రోజంతా ఆ రెండు మూడేళ్ల పిల్లల వెనకాల పరిగెత్తి, ఆడి,అలసిపోయేది రమణి. అయినా ఇదంతా చంద్ర హారం చేయుంచుకోవడానికి మార్గం గా భావించి కిక్కురుమనలేదు.ఓ నెల రోజులయ్యాకా ఆ కవల పిల్లల తండ్రి వచ్చి అస్సలు పిల్లలు ఇంటికి వచ్చి ఏమీ రాయడం చదవడం చెయ్యట్లేదని, ఎంత సేపూ తెలుగు పాటలేవో పాడుతున్నారనీ, అసలు స్కూల్లో ఏమి నేర్పిస్తున్నారని పెద్ద యుద్ధమే చేసాడు.మూడేళ్ళ పిల్లలకి రాయడం నేర్పడం ఏమిటి, హాయిగా వాళ్ళు ఆడుకుంటూ పాటలూ పద్యాలూ నేర్చుకోవాల్సిన వయసులో అని ఆనందరావు ఎంత నచ్చ చెప్పబోయినా ఆయన వినిపించుకోకుండా తమ పిల్లలని తీసుకుని ఎంచక్కా పోయాడు.

ఇంకో నెల రోజులకి బస్తీ పిల్లలు కూడా మానేసారు. ఆరా తెస్తే తెలిసిందేమిటంటే,ఆ సాఫ్ట్ వేర్ ఇంజనీరు తమ పిల్లని పేరున్న ప్లే స్కూల్లో వేసాడనీ, బస్తీ పిల్లలు ఆ పక్క కాన్వెంటు లో జాయిన్ అయ్యారనీ.

మూడో నెలలో ఇక ఖర్చు తప్ప రాబడి లేకపోవడం తో స్కూలు మూసేసారు ఆనందరావు దంపతులు.

కట్ చేస్తే..ఓ రెండు సంవత్సరాలు తిరిగేసరికి చంద్ర హారం వేసుకుని విద్యా శాఖా మంత్రి గారి పక్కన పట్టు చీరలో మెరిసిపోతూ రమణి విజయ గర్వం తో కూర్చుని ఉంది.

ఇది ఎలా సాధ్యమని అవాక్కయ్యారా.. ఆనందరావు పోయినచోటే వెతుక్కోమన్న సామెత ని నమ్మి తన బాలా నందాన్ని మూసేసాకా ఓ ఆర్నెల్లు స్కూళ్ళ తీరు తెన్నులనిగమనించడమే హాబీ గా పెట్టుకున్నాడు.

తన పాత స్కూలు పిల్లలకి పాఠాలు చెప్పలేకపోయినా తనకి కావాల్సిన పాఠాలు నేర్పింది మరి.

తన అయిడాలన్నీ కలిపి "సన్స్ క్రితి"(మీరు చదివినది కరక్టే, తెలుగు పేరు కానీ ఇంగ్లీషు పదం లా వినపడాలని "సంస్కృతి" ని "సన్స్ క్రుతి" చేసాడు) పేరుతో స్కూల్ ఏర్పాటు చేసాడు. పేరు పెట్టడం లోనే సగం విజయం దక్కేసింది మన విక్రమార్కుడికి.విద్యా బోధన అంతా ఇంగ్లీషే.రెండేళ్ళ పిల్లలకి ఇంగ్లీషు రైంస్, మూడేళ్ళ నుండి కంప్యూటర్ శిక్షణ,నాలుగైదేళ్ళ పిల్లలకి వర్డ్, పవర్ పాయింటు,ఫస్టు క్లాస్ నుండీ జావా, లాంటి ప్రోగ్రామింగు లాగ్వేజిలు..ఎం.సి.ఏ. అయిపోయి ఉద్యోగ వేట లో ఉన్న తన మేనళ్ళుడే ఈ కంప్యూటర్ బాషల శిక్షకుడు. మామయ్యా ఏదో వైవా కోసం, ప్రాజెక్టు కోసం నేర్చున్న నాలుగు

ప్రోగ్రాములు తప్ప నాకేమీ రావంటున్నా కానీ,నీకు క్షుణ్ణం గా రావని పిల్లలకీ వాళ్ళ తల్లి తండ్రులకీ తెలిదూ కదా,

ఉద్యోగం వచ్చేవరకు ఖాళీ గా ఎందుకు అంటూ లాక్కొచేసాడు.

నరసమ్మ లాంటి ఓ ఆడావిడ గిన్నెలు తోముతున్న ఫోటో ప్రతీ గదిలో వేళాడదీసాడు.హార్డ్ వర్క్ కి అది ప్రతీక అని పైకి చెప్తున్నా కానీ పిల్లలని ఎలా తోమాలో అన్న దానికి సూచన అన్న విషయం అధ్యాపకులకి మాత్రమే తెలుసు.

ఇంకా స్కూల్లోనే కరాటే, కుంగ్ ఫూ లాంటి మార్షల్ ఆర్ట్స్ తో పాటు, భరత నాట్యం, ఆంధ్ర నాట్యం, ఫోక్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్ లు చేర్చేసాడు.అస్సలు ఇంత మంది శిక్షకులని తేవడం ఎలా అని ఏ మాత్రం చింతించలేదు ఆనంద రావు.క్వాంటిటీ యే తప్ప క్వాలిటీ కి విలువ లేదన్న నిజాన్ని ఎప్పుడో గ్రహించాడు.

బస్సు, క్లాసు రూము అన్నీ ఏసీ చేయించేసరికి ఇంటికెళ్ళాకా కూడా ఏసీ కావాలని గొడవ చేస్తున్న పిల్లల కోసం తమ స్కూలు పిల్లలకి ఐదు శాతం రాయితీలో ఏసీ మిషన్ లు సప్లయ్ చేసే వ్యాపారం కూడా మొదలెట్టేసాడు.

ఎండా కాలం శెలవల్లో "సమ్మర్ క్యాంప్" పెట్టాడు. దాంట్లో పిల్లలకి ఉపయ్యోగపడే కంప్యూటర్ శిక్షణ లాంటివి మాత్రమే ఉండటంతో ఎనలేని స్పందన వచ్చింది.

రెండో తరగతి పిల్లలకి సైన్సు ప్రాజెక్టులు,మూడో తరగతి పిల్లలకి ఒలింపియాడ్ శిక్షణ కూడ చేర్చేసరికి ఎక్కువ మంది పట్టే ఓ నాలుగంతస్తుల కొత్త బిల్డింగ్ లోకి మారాల్సొచ్చింది.

పిల్లలని నిద్ర లేపడం దగ్గర నుండి రాత్రి పదింటికి ఇంటికి తీస్కొచ్చి దింపే(పడేసే) బాధ్యత ఉన్న స్కూలు గా ఎనలేని ఖ్యాతినార్జించింది మిస్టర్ ఆనంద్ స్కూల్. పిల్లలు ఇంటి నుండి టిఫిన్ బాక్సులు తెచ్చుకోవడం నిషిద్ధం.పోషకాహార నిపుణుల ఆధ్వర్యం లో తయారు చేసిన ఒక 100 గ్రాముల అన్నం మెతుకులు, నాలుగు పచ్చి కూర ముక్కలు,ఒక ప్రొటీన్ షేక్ తో మధ్యాహ్న భోజనం, సాయంత్రం నాలుగింటికి నాలుగు బాదం పలుకులు ఒక గ్లాసు పాలు, రాత్రి చిన్న రొట్టె ముక్క గ్లాసు పాలతో డిన్నర్.

తమ స్కూల్ లోగో వేసిన నోటు పుస్తకాలు,టెక్స్ట్ పుస్తకాలు పంపిణీ అయిపోయాయి.ఆర్నెల్లల్లో ఐదో తరగతి వరకూ పెంచాడు. స్కూలు వార్షికోత్సవం సమీపిస్తుండటంతో ఆనంద రావు కి ఇంకో అయిడియా తట్టింది. తమ స్కూల్లో చదివే పిల్లలకి తమ్ముడో చెల్లో త్వరలో వస్తునట్లయితే వారికి తమ అనుబంధ హాస్పిటల్ ద్వార గర్భస్థ ఐ.క్యూ. పరీక్షలు చేయించి అవసరమయితే ఐ.క్యూ. పెరగటానికి మందులు కూడా ఇచ్చే స్కీము ప్రవేశ పెట్టాడు.

ఆ ఐ.క్యూ. ఐన్ స్టీన్లు తమ స్కూల్ కి వస్తే వారికి మొదటి తరగతి నుండే ఐ.ఐ.టీ శిక్షణ అని ప్రకటించడం లో వచ్చిన రెస్పాన్స్ చూసి షాక్ కొట్టినట్లయ్యింది ఆనందరావు దంపతులకి.

ఆనందరావు ఉద్యోగం వదిలేసాడు.. తన మేనళ్ళుడేమో ఐదంకెల సాఫ్ట్ వేర్ ఉద్యోగాన్ని వద్దనుకుని భాగస్వామిగా చేరిపోయాడు.